నమ్మలేని నిజాలు

డ్రాగన్ మిత్రత్వం
గతంలో ఓ శత్రుత్వం
మారిన తత్వం.
తిరుగు బాటు
రాతలు మారుతాయి
రాజ్యాల గాథ.
పత్రిక స్వేచ్ఛ
ప్రజాస్వామ్యపు హక్కు
పక్షికి శిక్ష.
దీప విన్యాసం
పాపదహన కాంతి
నియంత అంతం.
పేదల బియ్యం
దొడ్డిదారిన మాయం
మాయా బజారు.

– రేడియమ్
సెల్: 9291527757



# నేటి నిజం

తెలుగు దినపత్రిక
website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

శ్రీనిజాలు

కేంద్ర ప్రభుత చర్యలతో
లొంగిరి మావోయిస్టులు!
ఒక చరిత్ర సృష్టించిరి
ఇన్నాళ్లు ఎవరికిష్టులు?
సొంతం అంతం చేస్తాం
తుపాకిచ్చి లొంగిపోండి !!
మేమిచ్చే డబ్బుల్తో
మీరు మెచ్చి పొంగిపోండి !!

– కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245



హైదరాబాద్ గురువారం 23-10-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 ▪ Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:59 పేజీలు:6 వెల: రూ.1/-

## గంటల వ్యవధిలో రవాణా చెక్ పోస్టులు క్లోజ్ చేయిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 22: తెలంగాణ రాష్ట్రంలోని అన్ని రహదారులపై ఉన్న రవాణా చెక్ పోస్టులను వెంటనే ఎత్తివేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సంచలన ఆదేశాలిచ్చారు. దీంతో తక్షణమే ఈ నిర్ణయాన్ని అమలు చేస్తున్నట్లు రవాణా శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈరోజు (బుధవారం) సాయంత్రం 5 గంటల్లోగా మూసి వేతపై పూర్తి నివేదికను ఇవ్వాలని సంబంధిత అధికారులను ముఖ్య మంత్రి ఆదేశించారు. సీఎం రేవంత్ ఆదేశాలతో తక్షణమే చెక్‌పోస్టుల కార్య కలాపాలు నిలిపివేయాలని ట్రాన్స్ పోర్ట్ కమిషనర్ ఆకస్మిక, తక్షణ ఆదేశాలు జారీ చేశారు. చెక్ పోస్టుల వద్ద ఉన్న సిబ్బందిని వెంటనే వేరే బాధ్యతల్లో వినియోగించుకోవాలని ఉత్తర్వులు ఇచ్చారు. రహదారులపై వాహనాల రాకపోకలకు ఎలాంటి అడ్డంకులు లేకుండా చర్యలు తీసుకోవా లని, చెక్ పోస్టుల వద్ద బోర్డులు, బ్యారికేడ్లు, తొలగించాలని డీటీవోలకు సూచించారు. అలాగే చెక్ పోస్టుల వద్ద ఉన్న రికార్డులు, పరికరాలు, ఫర్నిచర్‌ను డీటీవో కార్యాలయాలకు తరలించాలని ఆదేశించారు. అన్ని ఆర్థిక, పరిపాలనా రికార్డులను సరిచూసి భద్రపరచాలని హుకుం జారీ చేశారు.

## కాచిగూడ ఎక్స్‌ప్రెస్‌కు ఎల్‌హెచ్‌బీ కోచ్‌లు

చెన్నై, అక్టోబర్ 15: కాచిగూడ ఎక్స్‌ప్రెస్ రైలుకు జర్మన్ సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన ఎల్‌హెచ్‌బీ బోగీలు అనుసంధానం చేయనున్నారు. ఈ మేరకు దక్షిణ రైల్వే విడుదల చేసిన ప్రకటనలో... నాగం కోయిల్ నుంచి తెలంగాణా రాష్ట్రం కాచిగూడకు వెళ్లే (నెం.16354) రైలుకు డిసెంబరు 13వ తేది నుంచి,

కాచిగూడ నుంచి నాగర్‌కోయిల్ వెళ్లే (నెం.16353) రైలుకు ఈ డిసెంబరు 14వ తేది నుంచి 'లింక్ హాఫ్‌మాన్ బుచ్ (ఎల్‌హెచ్‌బీ) బోగీలు అనుసంధానం చేయనున్నారు. ఇవి సాధారణ బోగీల కన్నా ఎక్కువ మంది ప్రయాణికుల సామర్థ్యంలో పాటు ప్రమాదాల సమయంలో సురక్షితంగా ఉంటాయి.

## ఉస్మానియా ఆసుపత్రి కొత్త భవనంపై సీఎం సమీక్ష

హైదరాబాద్, అక్టోబర్ 22:ఉస్మానియా జనరల్ హాస్పిటల్ కొత్త భవన నిర్మాణం, అభివృద్ధి పనులపై ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈరోజు (బుధవారం) సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు కీలక ఆదేశాలు, పలు సూచనలు చేశారు సీఎం. రెండేళ్లలో ఉస్మానియా నూతన ఆసుపత్రి పూర్తి చేయాలని ఆదేశించారు. పనుల వేగవంతానికి సమన్వయ కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. రానున్న వందేళ్ల అవసరాలకు తగిన సదుపాయాలతో కొత్త ఉస్మానియా ఆసుపత్రి ఉండాలని.. ఆధునిక వైద్య పరికరాలతో అత్యాధునిక సదుపాయాలు కల్పించాలని వెల్లడించారు. ప్రతి 15 రోజులకు ఒకసారి నిర్మాణ సమీక్ష చేయాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచనలు చేశారు.

స్థానికులకు ఇబ్బంది లేకుండా రోడ్ల నిర్మాణం చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. హైదరాబాద్‌తో పాటు జిల్లాల్లోనూ ఆసుపత్రుల పనుల పర్యవేక్షణకు అధికారుల నియామకం జరిగిందన్నారు. వచ్చే జూన్ నాటికి అన్ని మెడికల్ కళాశాలలు, ఆసుపత్రుల పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే ట్రాఫిక్, భద్రతా ప్రణాళికలను ముందుగానే సిద్ధం చేయాలని పోలీసులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. ఈ సమావేశానికి



సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీలు శ్రీనివాసరాజు, శేషాద్రి, సెక్రటరీ మాణిక్ రాజ్, హెల్త్ సెక్రటరీ క్రిస్టినా, ఆర్ అండ్ బీ స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్, ఎంఏ అండ్ యూడీ సెక్రటరీ ఇలంబర్తి, డీజీపీ శివధర్ రెడ్డి, హైదరాబాద్ కలెక్టర్ హరిచందన, ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## అయ్యప్ప సేవలో ద్రౌపది ముర్ము.. శబరిమలను దర్శించుకున్న తొలి రాష్ట్రపతి

హైదరాబాద్, అక్టోబర్ 22:కేరళ పర్యటనలో ఉన్న భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రముఖ పుణ్యక్షేత్రం శబరిమలకు చేరుకున్నారు. ఇరుముడితో స్వామి వారిని దర్శించుకున్నారు. ఆరు కాన్వాయ్‌లతో ద్రౌపది ముర్ము శబరిమలకు చేరుకున్నారు. రాష్ట్రపతి కోసం నిబంధనలు సడలించిన అధికారులు వాహనాల్లో శబరిమల చేరుకునేలా ఏర్పాట్లు చేశారు

అంతకుముందు శబరిమలకు వెళ్తున్న క్రమంలో రాష్ట్రపతి పెద్ద ప్రమాదం నుంచి తప్పించుకున్నారు అయ్యప్ప స్వామిని దర్శించుకునేందుకు ఆమె హెలికాప్టర్‌లో ప్రయాణించారు. ప్రమదం ప్రాంతంలోని రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో హెలికాప్టర్ ల్యాండ్ అవుతున్న సమయంలో ఒక్కసారిగా హెలిప్యాడ్ కుంగిపోయింది. హెలికాప్టర్ చక్రం హెలిప్యాడ్ కాంక్రీట్‌లో కూరుకుపోయింది. అధికారులు వెంటనే స్పందించి సమస్యను సరిచేశారు.

## మంటల్లో కాలిపోయిన స్కూల్ బస్సు.. తప్పిన పెను ప్రమాదం..

హైదరాబాద్, అక్టోబర్ 22:రంగారెడ్డి జిల్లా కాటేదాన్ వద్ద తృటిలో ఘోర ప్రమాదం తప్పింది. విద్యార్థుల ఇండ్ల వద్ద నుంచి దించి వస్తున్న సమయంలో బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. నాదర్‌గుల్‌లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌కు చెందిన బస్సులో మంటలు వ్యాపించాయి. పొగలు రావడంతో వెంటనే బస్సును నిలిపివేసి డ్రైవర్ దిగిపోయాడు. కొద్ది నిమిషాల్లోనే మంటలు బస్సంతా వ్యాపించాయి. ఆ తర్వాత అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించగా.. సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. అయితే, ప్రమాదం జరిగిన సమయంలో విద్యార్థులు ఎవరూ బస్సులో లేకపోవడంతో పెను ప్రమాదం తప్పినట్లయ్యింది. అయితే, బస్సులో మంటలు చెలరేగడానికి కారణాలు తెలియరాలేదు.

## రాజన్న దర్శనాలు నిలిపివేసిన అధికారులు.. భక్తుల ఆగ్రహం

రాజన్న సిరిసిల్ల హైదరాబాద్, అక్టోబర్ 22: రాజన్న దర్శనాలను ఆలయ అధికారులు బుధవారం నిలిపివేశారు. కార్తీక మాసం కావడంతో రాజన్న సన్నిధికి మొక్కులు చెల్లించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. అయితే ఉదయం నుండి స్వామివారికి మొక్కులు చెల్లించుకునే క్రమంలో తలనీలాలు సమర్పించుకొని దర్శనానికి రాగా బంద్ చేసినట్లుగా భద్రతా సిబ్బంది వెల్లడించడంతో భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వామివారిని దర్శించుకునేందుకు అదిలాబాద్, నిజామాబాద్, వరంగల్, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని చాలా ప్రాంతాల నుంచి వచ్చామని భక్తులు వెల్లడించారు.

ఉదయం స్వామివారికి అభిషేకం చేసుకునే భక్తులకు మాత్రం అనుమతినివ్వగా భక్తుల సంఖ్య పెరిగిపోతుండడంతో ఆలయంలో రేకుల షెడ్డు తొలగించే పనుల్లో భాగంగా బంద్ చేసినట్లుగా ఆలయ అధికారులు వెల్లడించారు. ప్రచార సాధనాలు పెరిగాయని, ముందస్తు సమాచారం ఇచ్చి ఆలయాన్ని మూసివేస్తే బాగుంటుంది కదా అని భక్తుల అభిప్రాయపడ్డారు. ఒక్కసారిగా భక్తులు ఉత్తర ద్వారం వద్ద చేరుకొని ఉన్న కాస్త భక్తులైన దర్శించుకునేందుకు అనుమతి ఇవ్వాలని అధికారులను ప్రాధేయపడ్డారు.

అధికారుల ఆదేశాల మేరకే భక్తులను నిలిపివేశామని భద్రత సిబ్బంది వెల్లడించడంతో గంటల తరబడి భక్తులు అవకాశం కోసం ఎదురు చూశారు. ఇక చేసేదేమీ లేక కొందరు భక్తులు బయట నుండే స్వామి వారికి దండం పెట్టి వెను తిరిగారు. మరోవైపు ఆలయంలో భక్తుల దర్శనాల నిలిపివేతపై స్పష్టమైన ప్రకటన ఇప్పటివరకు అధికారికంగా ఇవ్వకపోగా, గందరగోళాల మధ్య భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

## జర్నలిస్టులను భయభ్రాంతులకు గురిచేయడం దుర్మార్గం : అల్లం నారాయణ



హైదరాబాద్, అక్టోబర్ 22:వార్తా పత్రికల కార్యాలయాలపై భౌతిక దాడులకు ప్రయత్నించడం, జర్నలిస్టులను భయభ్రాంతులకు గురిచేయడం దుర్మార్గమైన చర్య అని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ రాష్ట్ర అధ్యక్షులు అల్లం నారాయణ, ప్రధాన కార్యదర్శి అస్కాని మారుతిసాగర్ పేర్కొన్నారు. వరంగల్ జిల్లా నమస్తే తెలంగాణ ఎడిషన్ కార్యాలయంపైకి అధికార పార్టీకి చెందిన వందలాది కార్యకర్తలు వెళ్లి దాడికి ప్రయత్నించారని, అడ్డుకున్న సిబ్బందిని దుర్భాషలాడారని, తాము దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు.

వార్తల విషయంలో బేధాభిప్రాయాలు ఉన్నప్పుడు న్యాయపరంగా, చట్టపరంగా ముందుకు వెళ్లాలి తప్ప ఈ రకమైన భౌతిక దాడులకు ప్రయత్నించడం ఎంత మాత్రం సమంజసం కాదని, భావ ప్రకటన స్వేచ్ఛకు ఇది గొడ్డలిపెట్టని వారు ఆవేదన వ్యక్తంచేశారు. రాజ్యాంగం కల్పించిన మీడియా స్వేచ్ఛ హక్కును హరించే విధంగా రాజకీయ పార్టీలు వ్యవహరించడాన్ని వారు తప్పుపట్టారు.

దాడికి పరోక్షంగా కారకులైన వారితోపాటు ప్రత్యక్షంగా పాల్గొన్న వారు ఎంతటి వారైనా వాళ్లపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ రకమైన దాడులకు పూనుకుంటే జర్నలిస్టు సమాజం చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. జర్నలిస్టు సంఘాలు రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేసి ప్రజలకు వాస్తవాలను వివరిస్తాయని చెప్పారు.

దాడిని ఖండించిన వారిలో టీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షులు రమేష్ హజారే, కోశాధికారి యోగానంద్, తెంజు రాష్ట్ర అధ్యక్షులు విష్ణు వర్ధన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఏ రమణ కుమార్ ఉన్నారు

## చిరుతపై గ్రామస్థుల దాడి..

అమరావతి, అక్టోబర్ 22:అడవుల్లో ఉండాల్సిన క్రూర మృగాలు జనావాసాల్లోకి వస్తున్నాయి. అటవీ సమీప గ్రామాల్లోకి ప్రవేశించి ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. తాజాగా హిమాచల్ ప్రదేశ్ లోని ఉనా జిల్లాలో ఓ చిరుతపులి హారెత్తించింది. పొలాల్లోకి ప్రవేశించి అక్కడ పనిచేస్తున్నవారిపై దాడి చేసింది.

ఈనెల 20న చిరుత పొలాల్లో దాక్కుని ఉంది. దాని కేకలు విన్న సమీప ప్రజలు గ్రామంవైపు పరుగులుతీశారు. ఆ సమయంలో చిరుత వారిపై దాడి చేసింది. ఈ దాడిలో ముగ్గురు గాయపడ్డారు. అప్రమత్తమైన గ్రామస్థులు కర్రలు, రాళ్లతో చిరుతపై ఎదురుదాడికి దిగారు. గ్రామస్థులు దాడి చేయడంతో చిరుత పొలాల్లో నుంచి తప్పించుకుని ఓ ఇంట్లోకి ప్రవేశించింది.

గ్రామస్థులు వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. రంగంలోకి దిగిన అటవీ సిబ్బంది ట్రాంక్విలైజర్ డార్ట్‌ను ఉపయోగించారు. చిరుత స్పృహ కోల్పోయిన తర్వాత దాన్ని బోనులో ఉంచి వన్యప్రాణుల చికిత్స కేంద్రానికి తరలించారు. ఈ ఘటనతో స్థానికంగా తీవ్ర భయాందోళన వాతావరణం నెలకొంది. చిరుత దాడికి సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది.

## సంస్కృతి, సాంప్రదాయాలను భావితరాలకు అందించాలి

ఆదిలాబాద్, అక్టోబర్ 22:ఆదివాసి సంస్కృతి, సాంప్రదాయాలు గొప్పవని ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీరామ్ జాదవ్ అన్నారు. ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలం జామడ గ్రామంలో నిర్వహించిన దండారి ఉత్సవాలు బుధవారం ముగిశాయి. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. గుస్సాడీలకు, ఆదివాసి మహిళలకు శాలువాతో సన్మానించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదివాసులు నిర్వహించే ప్రతి పండుగకు ఒక ప్రత్యేకత ఉంటుందన్నారు. సంస్కృతి, సాంప్రదాయాలను భావితరాలకు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ ఆడే సురేష్, కో ఆప్షన్ సభ్యుడు ఉద్ధవ్ కాంబ్లే, మండల అధ్యక్షుడు మేస్రం హన్మంతరావు, మండల ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఖాసిం, చౌహాన్ యశ్వంత్, గ్రామ పెద్దలు, మహిళలు ఉన్నారు.

## ఢిల్లీని కమ్మేసిన దట్టమైన పొగ.. క్షీణించిన గాలి నాణ్యత

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 22: దేశ రాజధాని ఢిల్లీ లో వాయు కాలుష్యం రోజురోజుకీ క్షీణిస్తోంది. దీపావళి అనంతరం గాలి కాలుష్యం ప్రమాదకర స్థాయికి చేరుకుంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ప్రకారం.. దీపావళి అనంతరం రెండు రోజుల తర్వాత బుధవారం ఉదయం ఢిల్లీలో వాయు కాలుష్యం అధ్వాన స్థితికి చేరింది. ఏకంగా ఏక్యూఐ లెవెల్స్ 345గా నమోదయ్యాయి. ఉదయం 6:15 గంటల సమయంలో అశోక్ విహార్, బవానా, దిల్షాద్ గార్డెన్ ప్రాంతాల్లో ఏక్యూఐ 380గా నమోదైంది. డీటీయూ, ఎయిర్‌పోర్ట్, లోధి రోడ్డు సహా ఇతర ప్రాంతాల్లో గాలి నాణ్యత సూచీ 300 కంటే ఎక్కువగానే నమోదైంది. మరోవైపు రాజధాని ప్రాంతాన్ని దట్టమైన పొగ కమ్మేసింది. దీంతో విజిబిలిటీ కూడా పడిపోయింది. ముందు వెళ్తున్న వాహనాలు కూడా కనిపించని పరిస్థితి. ఫలితంగా రాజధాని వాసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

సుప్రీంకోర్టు విధించిన మూడు గంటల పరిమితిని ఉల్లంఘించి చాలా మంది ప్రజలు టపాసులు కాల్చడంతో మంగళవారం ఢిల్లీలోని రెడ్ జోన్‌లో వాయు నాణ్యత చాలా తక్కువ (వెరీ పూర్) స్థాయిలో నమోదైన విషయం తెలిసిందే. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి బులెటిన్ ప్రకారం మంగళవారం ఉదయం 8 గంటలకు వాయు నాణ్యత సూచీ (ఏక్యూఐ) 352 పాయింట్లుగా నమోదైంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ పరిమితి కంటే ఇది 15 రెట్లు ఎక్కువ. ఈ నెల 20న ఏక్యూఐ 345 పాయింట్లుగా నమోదైంది.

ఎయిర్ క్వాలిటీ అండ్ వెదర్ ఫోర్‌కాస్టింగ్ అండ్ రిసెర్చ్ నివేదిక ప్రకారం.. గాలి నాణ్యత 447కు పడిపోవడం అంటే దాన్ని తీవ్ర వాయు కాలుష్యంగా పరిగణించవచ్చు. ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ (ఏఖఐ) 0-100 మధ్య ఉంటే గాలి నాణ్యత బాగా ఉందని, కాలుష్యం లేదని, ఏఖఐ 100-200 మధ్య ఉంటే గాలి నాణ్యత మధ్యస్తంగా ఉందని అర్థం. ఇక ఏఖఐ 200-300 మధ్య ఉంటే గాలి నాణ్యత అధ్వాన్నంగా ఉందని, ఏఖఐ 300-400 మధ్య ఉంటే గాలి నాణ్యత మరింత అధ్వాన్నంగా ఉందని, ఏఖఐ 400-500 మధ్య ఉంటే కాలుష్యం తీవ్ర స్థాయిలో ఉందని అర్థం చేసుకోవచ్చు.

## తమిళనాడులో కుండపోత వర్షాలు.. ఇల్లు కూలి ఇద్దరు మహిళలు మృతి



తమిళనాడు, అక్టోబర్ 22: తమిళనాడు లో కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. ఎడతెగని వర్షాలు రాష్ట్రాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. కడలూరు జిల్లా లో భారీ వర్షాల కు ఓ నివాసం కూలిపోయింది. దాంతో ఆ ఇంట్లోని ఇద్దరు మహిళలు ప్రాణాలు కోల్పోయారు. బంగాళా ఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం రాబోయే 24 గంటల్లో తీరందాటే అవకాశం ఉండటంతో తమిళనాడుతోటు ఆంధ్రప్రదేశ్‌లోని దక్షిణ కోస్తా జిల్లాల్లోనూ అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని అంతకుముందే భారత వాతావరణ విభాగం హెచ్చరించింది.

తమిళనాడులోని చెంగల్‌పట్టు, విల్లుపురం, కడలూరు, మైలాడుతురై జిల్లాలకు ఐఎండీ రెడ్ అలర్ట్ జారీ చేసింది. అదే సమయంలో ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు, ప్రకాశం, తిరుపతి, అన్నమయ్య, చిత్తూరు, కడప జిల్లాలకు కూడా రెడ్ అలర్ట్ ప్రకటించింది. కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. 24 గంటల వ్యవధిలో 20 సెంటీమీటర్లకు పైగా వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు.

ఈ వర్షాల నేపథ్యంలో తమిళనాడు ప్రభుత్వం సహాయక చర్యలను ముమ్మరం చేసింది. రెడ్ అలర్ట్ జారీ అయిన జిల్లాలకు 12 మంది సీనియర్ ఐఏఎస్ అధికారు లను ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పర్యవేక్షకులుగా నియమించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, సహాయక శిబిరాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. చెంగల్‌పట్టు కలెక్టర్ డి స్నేహ మాట్లాడుతూ.. వర్షాలకు ముందే పూడికతీత పనులు పూర్తి చేశామని, నీటిని తోడే పంపులు, సహాయక కేంద్రాలు, కమ్యూనిటీ కిచెన్లు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. భారీ వర్షాల కారణంగా తమిళనాడులోని 13 జిల్లాల్లో పాఠశాలలకు, కళాశాలలకు సెలవులు ప్రకటించారు. తూత్తుకూడి, తిరువారూర్ జిల్లాల్లోని పలు లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి వరద నీరు చేరింది. నాగపట్నం, తిరు వారూర్ జిల్లాల్లో వేలాది ఎకరాల్లో వరి పొలాలు నీట మునిగి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేం దుకు జేసీబీలు, బోట్లు, చెట్లను తొలగించే యంత్రాల తోపాటు జాతీయ విపత్తు స్పందన దళం బృందాలను సిద్ధంగా ఉంచారు.

## దశల వారీగా మౌలిక సదుపాయాల కల్పన : ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్, అక్టోబర్ 22 : నకిరేకల్ పట్టణంలో మౌలిక సదుపాయాల కల్పన కృషి చేస్తున్నట్లు, ప్రాధాన్యతా క్రమంలో దశల వారీగా పనులను పూర్తి చేయనున్నట్లు ఎమ్మెల్యే వేముల వీరేశం తెలిపారు. బుధవారం పట్టణంలోని 1వ, 8వ, 9వ వార్డుల్లో రూ.1.55 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న సీసీడ్రెన్ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మున్సిపాలిటీలో దశాల వారీగా డ్రైనేజీ వ్యవస్థను బాగు చేస్తామన్నారు. ఈ నెలలో పట్టణంలో 100 పడకల ఆస్పత్రిని ప్రజలకు అందుబాటులోకి తెస్తామని తెలిపారు. నియోజకవర్గానికి ఐటీ కాలేజీ మంజూరూ చేయాల్సిందిగా ఇప్పటికే సీఎంకు విన్నవించినట్లు చెప్పారు.

బ్రహ్మణవెల్లంల, పిల్లాయిపల్లి, ధర్మారెడ్డి కాల్వ ద్వారా చెరువుల్ని నింపుతున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చెవుగోని రజితా శ్రీనివాస్, వైస్ చైర్మన్ మూరారిశెట్టి ఉమారాణీ కృష్ణమూర్తి, అధికారులు, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

## బైక్‌పై తిరిగి వెళ్తుండగా..

మెదక్, అక్టోబర్ 22:బైక్ స్కిడ్ అయ్యి క్రింద పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన నర్సాపూర్ మండల పరిధిలోని రుస్తుంపేట్ గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది.

ఎస్ఐ లింగం తెలిపిన వివరాల ప్రకారం.. రుస్తుంపేట్ గ్రామానికి చెందిన మన్నె యాదగిరి(41) మంగళవారం సాయంత్రం తన కుమారుడిని శివంపేట్ హాస్టల్‌కు పంపడానికని బైక్‌పై నర్సాపూర్ బస్టాండ్‌కు వచ్చి తన కొడుకును బస్సులో ఎక్కించాడు. అనంతరం సొంత పని నిమిత్తం నర్సాపూర్ నుండి మండల పరిధిలోని సీతారాంపూర్ గ్రామానికి వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. బుధవారం ఉదయం 5 గంటల ప్రాంతంలో పంట పొలాల వద్ద రోడ్డుపై పడి తలకు, ముక్కుపై బలమైన గాయాలై మృతి చెంది ఉన్నాడు.



రాత్రి సమయంలో తన బైక్‌పై నుండి తనకు తానుగా రోడ్డుపై స్కిడ్ అయ్యి చనిపోయాడని మృతుడి భార్య మన్నె గంగమ్మ ఫిర్యాదులో పేర్కొన్నారు.

### రాధశ్రీ రాగాలు

నడమంత్రముగ లక్కు
నడచి వచ్చిన చిక్కు
సత్యమిది నావాక్కు
అనును రాధశ్రీ !!
పులిని చూచుట చేత
తెలివి తక్కువ చేత
నక్కెట్టుకొనె వాత
అనును రాధశ్రీ !!

-రాధశ్రీ
సెల్:9494481210




### చురక

స్వయంవృద్ధి సాంకేతిక
సాధనే మన ప్రధానం
ప్రభుత్వానికెక్కడుంది
ప్రోత్సహించే విధానం
సృజనాత్మక పరిశోధన
చేయ ఈడ అవకాశం
ఉంటే ఎలా విదేశాలు
ఉరుకు మేధో వికాసం

-వేల్పుల నారాయణ
9440433475






నేటి నిజం
# సాహితీ కెరటాలు
E-mail : netinijam93@gmail.com    website: www.netinijam.com
2 హైదరాబాద్    ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433    గురువారం 23-10-2025

## హైకూలు


ముఖారవిందం
చిరునవ్వు పూసింది
నిత్య పున్నమి.

చిట్టడవిలో
నల్లమబ్బుల నృత్యం
ఏట్లో ఝుమ్మంది.

హాయిగా నిద్ర
ఉయ్యాలలో కాదులే
అమ్మ ఒడిలో.

మనసు నిండా
మమతలు లేకుంటే
పెను చీకటే.

ముళ్ళపొదలో
ముద్దులొలికే అందం
గులాబి భామ.



- బొబ్బిలి జోసెఫ్
సెల్: 9989261991

## ఘంటారావం


దండం దక్షతను
దర్శించు
గండం గడుస్తుందని
గ్రహించు.

రెక్కలు ముక్కలయ్యే
బక్క డొక్కలు చూడు
లెక్కకు మిక్కిలి మెక్కే
పందికొక్కుల చూడు.

మానవుల పూర్వీకులు
వానరులట
అందుకనే ఊరూరా
హనుమంతుడట.


ఊరికే
ఉంటారు
తీరికి
లేదంటారు.

మనవడు
ముత్తాతయ్యేదాకా
మనన ఓడ
నడవాలనే కోరిక



-గంటా మనోహర్‌రెడ్డి
సెల్:9949992964

# భాషా సేవకుడు 'తిరుమల రామచంద్ర'



'పని నుంచి పనికి మారటమే విశ్రాంతి' అనే వారట ఈ అవిశ్రాంత సాహితీవేత్త, కవి, రచయిత, బహు భాషావేత్త, స్వాతంత్ర్య సమర యోధుడు, గొప్ప అనువాదకుడు, పత్రికా సంపాదకులు, తెలుగుతో పాటు, తమిళ, కన్నడ, సంస్కృతమే గాక ప్రాకృతంలో కూడా పట్టువున్న మహాపండితులు **'తిరుమల రామ చంద్ర'** మహాశయుడు. ఎన్నో సాహిత్య ప్రక్రియలలో నిష్ణాతులైనా తన్ను తాను ఎంతో వినమ్రంగా 'భాషా సేవకుడ' ని చెప్పుకొనే నిగర్వి. 1913 జూన్ 17వ తేదీనాడు అనంతపురం జిల్లా ధర్మవరం తాలూకాలోని రేగడిపల్లె లో శేషాచార్యులు, జానకమ్మ దంపతులకు జన్మించాడు తిరుమల రామచంద్ర. బాల్యం కొంత కాలం సొంత ఊరి లోనూ, హంపి శిథిలాలలోని గ్రామమైన కమలాపురం లో కొంతకాలం గడిచాయి. వీరు విజయనగర రాజుల ఆస్థానములో ప్రసిద్ధిగాంచిన తాతాచార్యులవారి వంశీకులని అంటారు. ప్రాథమిక విద్య సొంత ఊరులోనే, తరువాత మద్రాసు విశ్వవిద్యాలయం నుండి సంస్కృత, తెలుగు విద్వాన్, పంజాబ్ విశ్వవిద్యాలయం నుండి హిందీ లో ప్రభాకర, ఆలీఘర్ ఆయుర్వేద పీఠం నుండి ఆయుర్వేద భూషణ పట్టాలు పొందాడు. ఆ రోజుల్లో భారతి మాసపత్రిక లో ఏదైనా ప్రచురణ కావడమంటే పేరున్న విశ్వవిద్యాలయం నుండి గౌరవ డాక్టరేట్ పొందినంత గొప్పవిషయం అంటారు. ఆ అదృష్టం తిరుమల రామచంద్రకు తన 22 వ ఏటనే అంటే 1935లోనే దక్కింది. ఆ వ్యాసం పేరు **'ఆంధ్ర ఛ్ఛందో విశేషములు'** ఇందులో వజ్ఝల సీతారామశాస్త్రి వాదన ప్రకారం ద్విపద లో యతి, ప్రాసలను కొంతమంది పండితులు పాటించలేదనే ఆక్షేపనని, పూర్వపక్షం చేస్తూ, వేటూరి ప్రభాకర శాస్త్రిగారి వాదాన్ని సమర్థిస్తూ రామచంద్ర వ్రాసినది. గిడుగు రామమూర్తి పంతులుగారు వేటూరి ప్రభాకరశాస్త్రిని ఒక మాటు కలసినపుడు ఈ వ్యాసం గురించి ప్రస్తావన వచ్చిందట. శాస్త్రిగారు తిరుమల రామచంద్రను వారికి చూపించారట. గిడుగు వారు ఆశ్చర్యపడి **'ఈ కుర్రాడా! ఎవరో శాలువా పండితుడనుకొన్నాను'** అన్నాడట. అంత చిన్న వయసులోనే రామచంద్ర పెద్దల మన్ననలు పొందాడనటానికి ఇదొక తార్కాణం. జీవనోపాధి కోసం ఎన్నెన్నో ఉద్యోగాలు ఎక్కడెక్కడో చేసినా అవి తాత్కాలిక మే. రెండవ ప్రపంచ యద్ధకాలంలో సైన్యంలో హవల్దార్ గుమస్తాగా బెలూచిస్థాన్ సరిహద్దులలో పనిచేశారు.

1944 లో పత్రికారం గంలో మొదట తెలంగాణ పత్రికలో పనిచేసి, తరువాత మీజాన్ పత్రికలో చేరి, ఆ పత్రికా సంపాదకుడు అడివి బాపిరాజు శిష్యరికంలో ఎన్నో మెలుకువలు నేర్చుకున్నారు రామచంద్ర. తర్వాత ఢిల్లీ లోని 'డెయిలీ టెలిగ్రాఫ్' ఆంగ్ల పత్రికలో చేరి పాత్రికేయ వృత్తిలో కొంత స్థిరపడినాడు. ఆంధ్రప్రభ, ఆంధ్రపత్రిక, భారతి మాసపత్రిక, హిందుస్తాన్ సమాచార్ వంటి పత్రిక ల్లో వివిధ రకాల పదవుల్లో రాణించారు.

పాత్రికే యుడు కావడానికి ముందు మద్రాసు ఓరియంటల్ మ్యాను స్క్రిప్ట్ లైబ్రరీ, తంజావూర్ సరస్వతి మహల్ లైబ్రరీలో పండితుడిగాను, జిల్లా రీసెర్చ్ ఇన్సిటూట్ లో సంస్కృత లిఖిత కాటలాగగా పనిచేశాడు. అనువాదకుడిగా ఎన్నో ఉత్తమ గ్రంథాలను సంస్కృత, ప్రాకృత, కన్నడ, తమిళ, హిందీ, ఆంగ్ల భాషల నుండి తెలుగు భాషలోకి తర్జుమా చేశాడు. 'బాబ్ కోహెన్' అనే విదేశీయుడు ప్రభుపాదులవారితో చేసిన సంభాషణలను రచించిన ' Perfect questions --- perfect answers' అనే ఆంగ్ల పుస్తకాన్ని భక్తి వేదాంత బుక్ ట్రస్ట్ తరపున **'ఉత్తమ ప్రశ్నలు- ఉత్తమ సమాధానాలు'** పేరట అనువాదం చేశారు రామచంద్ర. క్షేమేంద్రుని **'బృహత్కథామంజరి'** ని తెలుగులోకి అనువదించాడు. '20 వ శతాబ్ది అమెరికాలో మతం' అన్న పేరుతో 1962లో హెర్బర్ట్ వాలస్ షినీడర్ వ్రాసిన, religion in 20 th century'America 'అనే ఆంగ్ల రచనను అనువదించాడు. ఎన్నో పుస్తకాలతోపాటు **'నూరేళ్ళ తెలుగు వ్యాసం',, నుడి--నానుడి, మన లిపి... పుట్టు పూర్వోత్తరాలు, సాహితీ స్వగతుని స్వగతం, మరపురాని మనిషి, గాథాసప్తశతిలో తెలుగు పదాలు, మూడు వాఙ్మయ శిఖరాలు, ధర్మదీక్ష, తెలుగు పత్రికల సాహిత్యసేవ, ప్రాకృత వాఙ్మయములో రామకథ, అనువాద కల్పలత, హాలుని గాథలు, మనవి మాట,, హంపి నుంచి హరప్పా దాక(స్వీయ చరిత్ర).** లాంటి పుస్తకాలు అన్ని వర్గాల పాఠకులను నేటికీ ఆకట్టుకుంటున్నాయి. వారి పుస్తకాలలో కొన్ని వివరాలు ఇలా.... నుడి--నానుడి లో పదాల ఉచ్చారణను బట్టి అసలు రూపాలు ఎలా ఉంటాయో ఊహించి అవి నిర్ధారించేందుకు రామచంద్ర చేసిన పరిశోధనలు పాఠకులను సంభ్రమాశ్చర్యాలకు గురిచేస్తుంది. విష్ణుశర్మ పంచతంత్రంలో జంతువులతో మాట్లాడించినట్లు, రామచంద్ర కూడా ఈ పుస్తకంలో తెడ్డు, రోకలి లాంటి వస్తువులతో మాట్లాడించి వాటి వివరాలు తెలియజెప్పాడు. మన భాషా పదాలు కాని కొన్ని, కొన్ని వస్తువులైతే పూర్తిగా మనవికాదనే విషయాన్ని చర్చిస్తే మామూలు పదాలకు కూడా ఇంత చరిత్ర వుందా? అనిపిస్తుంది. ఇక **'ప్రాకృత వాఙ్మయంలో రామకథ'** లో భాషాశాస్త్రంలో అనులోమ, ప్రతిలోమాలు సహజమని ఈ పుస్తకంలో ప్రస్తావిస్తారు కవి. సంస్కృతం అపభ్రష్టమై ప్రాకృతమయిందన్న సిద్ధాంతం అశాస్త్రీయమని తిరుమల రామచంద్ర శాస్త్రీయవాదన. ' సజీవతి మనోయస్య మననేవహి జీవతి ' అన్న యోగవాశిష్ఠం శ్లోకం '(plants also live, and birds and beasts live: but he lives( truly) whose mind lives by thinking ') **ఎవరైతే మనసుతో మనసార జీవిస్తారో, వాళ్ళే నిజంగా జీవించినట్లు'** అని అర్థం. ఇలా చెక్కుచెదరని మనసుతో జీవించిన వారిలో మొదటి కోవెకు చెందిన వారు తిరుమల రామచంద్ర అన్నారు అక్కిరాజు రమాకాంత రావు. ఇది అక్షర సత్యం. రామచంద్ర వారి నిజాయతీ, నిరాడంబరత్వాన్ని, నిర్మోహమాటత్వాన్ని, అకుంఠిత సాహిత్యసాధనను తెలియజేసే కొన్ని వాక్యాలను రామచంద్ర గారి కుమార్తె 'నాకు తెలిసిన మా నాన్న' అనే వ్యాసం లో కొన్ని వాక్యాలు. .. **"నాన్నను తలచుకుంటే దుఃఖం పొంగివస్తుంది. జీవితాంతం ఖద్దరు కట్టిన గాంధేయవాది. ఇద్దరు, ముగ్గురు బహూకరించినా,చివరిదాకా గడియారం కూడా కట్టని యోగి. రాతలే జీవితధ్యేయంగా వాటి కోసమే చివరి వరకు పరిశ్రమించిన మేరునగధీర మనస్కుడు. వంటచేయడం సమయాన్ని వృర్థం చేయడమేనని కొంతకాలం అపక్వ ఆహారం తీసుకొని కాలం గడిపిన నిత్య సంతోషి"** అన్నారు డా. తిరుమల నీరజ. పత్రికార శిరోమణి, కళా సరస్వతి, మహా మహోపాధ్యాయ లాంటి బిరుదులు ఆయనను వరించినా... నిగర్వి. 20వ శతాబ్దంలో తెలుగులో రాసిన గొప్ప పుస్తకాలలో ఏ పది పుస్తకాలు పరిగణించాలన్నా ఆయన స్వీయచరిత్ర 'హంపి నుంచి హరప్పా దాక ' లెక్కకు వస్తుంది. అదే వారి చివరి రచన. ఈ పుస్తకానికే 2001 డిశంబర్ లో కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు లభించింది, దివంగతులైన అనంతరం. ఈ రచన గురించి చెప్పాలంటే చారిత్రాత్మక స్వీయ కథనం ఇది. అంతేగాక ఆనాటి సంస్కృతిని, నాటి సాంఘిక, ఆర్థిక వ్యవహారాలకు అద్దం పడుతూ పాఠకులను ఊపిరి సలపకుండా హాయిగా సొంతం చదివిస్తుంది. రామచంద్ర గారి గురించి మరి కొన్ని విషయాలు ఇక్కడ ముచ్చటించుకోవలసిన అవసరం వుంది. తన చిన్నతనంలో అంటే 1921లో మహాత్మ గాంధీ బళ్ళారి కి వస్తున్నారన్న వార్త తెలియడం తో ఆ చిన్నవాడిలో గాంధీని చూడాలన్న కోరిక కలిగింది.

ఇంట్లో తాతగారి అనుమతి తీసుకుని ఆ ఊరి జనంతోపాటు కొన్నివేలమంది మధ్యలో వుండి బళ్ళారిలో గాంధీని చూసి సంభ్రమాశ్చర్యానికి లోనయ్యాడు. విచిత్రమేమిటంటే 12 సంవత్సరాల తరువాత అంటే 1933లో హరిజనోద్యమ సందర్భంగా చిత్తూరు నుంచి మద్రాసు వరకు గాంధీజీ తో ఒకే కారులో ప్రయాణించే గొప్ప అవకాశం లభించింది తిరుమల రామచంద్రకు. ఇది ఎంత మహద్భాగ్యమో ఎవరైనా ఊహించుకొన

వచ్చును. ఈ విషయం ఎవ్వరికీ చెప్పలేదు జీవితం లో. తన రచన 'హంపి నుంచి హరప్పా దాక' పుస్తకం చదివినవారికి తప్ప ఎవరికీ తెలియదు. పుస్తకం పేజీ నెం.. 90, /14 వ ప్రకరణంలో ఉపశీర్షక


'బళ్ళారిలో గాంధీజీ' లో చెప్పబడివున్నది. చూసివచ్చినా కాల్చివచ్చినట్లు బడాయిలు చెప్పుకునే ఈ రోజుల్లలో ఇలాంటి మహానుభావులుంటారని ఊహించలేము.

లాహోర్ పాకిస్థాన్ కు పోయినపుడు నా పిత్రార్జితం పోయిందని భోరున ఏడ్చారట రామచంద్ర మహాశయుడు. వారి మనస్తత్వ పరిశీలనకు అద్దంపట్టే ఇంకొక ఉదంతం చెప్పుకోవాల్సందే..... లాహోర్ లో 'అనార్కలీ' సమాధిని చూసిన రామచంద్ర కన్నీరు కార్చేశాడట. 'దుర్మార్గులైన అక్బర్ కూ, సలీమ్ కూ రౌరవాది నరకం ప్రాప్తించివుంటుందని నా విశ్వాసమని' నిట్టూర్చారట రామచంద్ర.

ఆరు దశాబ్దాలలో తెలుగు పత్రికారంగంలో ఆయన రాసింది పదివేల పేజీలకు పైగానే వుంటాయి. అందులో ఏ ఒక్క అక్షరాన్నీ వృథా స్థానంలో వుంచలేదు.

ఈ వ్యాసం లోనే తొలి వాక్యంగా విన్నవించుకున్న శ్రమ మంత్రాన్ని మరొక్కసారి స్మరించుకుంటూ తిరుమల రామచంద్ర సాహితీ యజ్ఞం కొనసాగింపులో పాలుపంచుకోవడమే వారికి మనమిచ్చే 'ఘన నివాళి'

'పని నుంచి పనికి మారటమే విశ్రాంతి'



– మాయకుంట్ల నారాయణరెడ్డి
99896 86603

> "నాన్నను తలచుకుంటే దుఃఖం పొంగివస్తుంది. జీవితాంతం ఖద్దరు కట్టిన గాంధేయవాది. ఇద్దరు, ముగ్గురు బహూకరించినా,చివరిదాకా గడియారం కూడా కట్టని యోగి. రాతలే జీవితధ్యేయంగా వాటి కోసమే చివరి వరకు పరిశ్రమించిన మేరునగధీర మనస్కుడు. వంటచేయడం సమయాన్ని వృర్థం చేయడమేనని కొంతకాలం అపక్వ ఆహారం తీసుకొని కాలం గడిపిన నిత్య సంతోషి"

> "1933లో హరిజనోద్యమ సందర్భంగా చిత్తూరు నుంచి మద్రాసు వరకు గాంధీజీ తో ఒకే కారులో ప్రయాణించే గొప్ప అవకాశం లభించింది తిరుమల రామచంద్రకు"

> "ఆరు దశాబ్దాలలో తెలుగు పత్రికారంగంలో ఆయన రాసింది పదివేల పేజీలకు పైగానే వుంటాయి. అందులో ఏ ఒక్క అక్షరాన్నీ వృథా స్థానంలో వుంచలేదు"

## అక్షత వీరుడు శివారెడ్డి

కవిత్వంతో
మనుషుల్ని కలిపినట్టు
విరిగిన నీ ఎముకలు
అలవోకగా అతుక్కుపోతాయిలే
కాకపోతే కాస్త విరామం.

సంక్లిష్టమైన జీవితం నీది
కష్టమే అనిపించదు నీకు
ఇతరుల కష్టాలు నీకు
సుతరాము ఇష్టం వుండదు.

ద్వారకవైపు వచ్చినప్పుడు
ఆఖరి బస్సు ఎక్కించడానికి వచ్చేవాడివి
చార్జీలు లేకపోతే
ఉన్నదాంట్లో సర్దేవాడివి.

తెలుగు పద్యం
హృదయ దఘ్నంగా పాడతావని
చాలామందికి తెలియదు.
ఆ రాగాన్ని
గుండె చుట్టూ అల్లుకొని
ఇంటి ముఖం పట్టేవాళ్ళం.

బూతు మాటలు నీ నోట్లో
రసపూర్ణ గీతుల్లాగే వినిపిస్తాయి.
స్నేహితులకు నువ్విచ్చే ధీమా
జీవిత బీమాను తలపిస్తుంది.
కాళ్లకు బలపాలు కట్టుకుని తిరుగుతావు
ఆ బలపాల్తో కూడా
కవిత్వమే రాస్తావు
స్నేహంలో పోటీ పెడితే
నువ్వే గెలుస్తావు.
ఆ రోజుల్లో నువ్వు చేసిన అప్పులన్నీ
మిత్రుల కోసమే అని గుర్తు
జ్ఞానయ్యా! ఎక్కడున్నావ్!.

రైతు బిడ్డకుండే
మట్టి గడ్డ లక్షణాలు పోలేదు నీకు
మొలకలన్నీ కవితలే
మిత్రమా!
తొందరగా కోలుకో
అలా ద్వారక చుట్టూ మళ్లీ తిరిగొద్దాం
అయితే
కాస్త రోడ్డును చూసుకొని దాటు
ముందే దెబ్బతిన్న ప్రాణం.

( కవి శివారెడ్డికి నాలుగో సారి ఎముకలు విరిగినప్పుడు)



-డా॥ ఎన్. గోపి
సెల్:9391028496

## మరక

కొత్త అంగీ వేసుకోగానే
జేబుపై మరక పడుతుంది.

అన్ని చొక్కాల మీద అంతే
ఆ సిరా మరకలు ఆనవాయితే..

ఏది ఏమైనా సరే..
జేబులో పెన్ను పెట్టడం మానను
పెన్ను లేకుండా బయటికెళితే
గన్ను లేకుండా యుద్ధానికెళ్ళినట్టే.

మరకలకు భయపడి పెన్నును
అపవాదుల భీతిల్లి ఆశయాన్ని
నడిమధ్యన ప్రాణప్రద కవిత్వాన్ని
చిత్తు కాగితంలా వదిలేయలేను.

ఆ మరకలు
దేశంలోని మారణ హోమాలకు
కులాల కుమ్ములాటలకు ప్రతీకలు.
అధికారం అమాయకత్వాన్ని
అంధకారం జ్ఞానోదయాన్ని
అంతం చేస్తున్న రాజ్యహింస.

ఇప్పుడు
రాజ్యాంగం లోని అంగాంగం
రక్తం పులుముకుంది
అధ్యాయాల్లోని అక్షరాలన్నీ
దుఃఖనదులై పారుతున్నాయి
బట్టలు ఉతుకుతున్నప్పుడు
ఇంకు మరకలు పోవట్లేదని
మా ఆవిడ విసుక్కుంటుంది .

నా గుండె మాత్రం..
దేశం జెండాపై పడుతున్న
మరకలెలా పోగొట్టాలో
ఓ పద్యం రాయమంటుంది



-మౌనశ్రీ మల్లిక్
8919338546

## 'భారీ' విరాళం

(కథ)

'హల్లో! ఆపన్న హస్తామా?"
"ఔనండీ. మీరెవరు?"
"నేను దైవాదీనాన్ని. వనస్థలిపురం నుంచి మాట్లాడుతున్నాను. మీ ప్రకటనకు స్పందించి, ఏదో ఉడతాభక్తిలా మీ సంస్థకు విరాళం ఇవ్వాలనుకుంటున్నాను. ఎవరినైనా పంపుతారా? చెక్కు ఇస్తాను."

"మా బ్యాంకు ఖాతా నంబర్ ఇస్తాము, ఆన్ లైన్ బదిలీ గానీ లేక మొబైల్ నంబర్ ఇస్తాం, గూగుల్ పే గానీ ఫోన్ పే గానీ చేయండి."

"అయ్యా! నేను ఎనభై సంవత్సరాల వయోవృద్ధుణ్ణి. పాతకాలం వాణ్ణి. నాకు మీ గూగుల్ పే లు ఆన్ లైన్ బదిలీలు తెలీవు. మీరే ఎవరినైనా పంపితే బాగుంటుంది. అన్నట్టు మీ పేరేమిటి?"

"నా పేరు సుధీర్. సరే రేపు ఉదయం పదకొండు గంటలకు వస్తాను. మీ చిరునామా చెప్పండి, రేపు ఇంట్లో మీరుంటారు కదా?" సుధీర్ చిరునామా రాసుకున్నాడు. అక్కడికి వెళ్లాలంటే మూడు బస్సులు మారి, యాభై కిలోమీటర్లు ప్రయాణం చేయాలి.

"నేను ఎప్పుడూ ఇంట్లోనే ఉంటాను. రేపు తప్పకుండా రా బాబూ."

మర్నాడు సుధీర్ వెళ్లేసరికి దైవాదీనం గారు ఇంట్లోనే ఉన్నారు. "ఆపన్న హస్తం" సంస్థ గురించి సవాలక్ష ప్రశ్నలు వేశారు. తాను విశ్రాంత ప్రభుత్వోద్యోగిననీ, తన పిల్లలిద్దరూ విదేశాల్లో స్థిర పడ్డారనీ, తనని పలకరించే వాళ్ళు లేక మొహం వాచిపోయిందన్నారు. ఎవరితోనైనా తన గోడు చెప్పుకుంటే మనసు తేలికౌతుందన్నారు. అందుకే చెక్కు తీసుకోవడానికి అలా వ్యక్తిగతంగా పిలవాల్సి వచ్చిందని తనను తాను సమర్థించుకున్నారు. ఆ తర్వాత ఆపన్న హస్తం పేర చెక్కు ఇచ్చారు.

ఆ చెక్కు పైన రాసిన మొత్తం చూసి, సుధీర్ కళ్లు బైర్లు కమ్మాయి. అక్షరాలా యాభై ఒక్క రూపాయల చెక్కు! వందా యాభై రూపాయలు రవాణా ఖర్చులు పెట్టుకొని వస్తే అంతోటి విరాళమా? రెండున్నర గంటలు వెచ్చించి, యాభై కిలోమీటర్ల దూరం నుండి వచ్చిందానికి అంత భారీ విరాళమా? అనుకుని మనసులోనే దైవాదీనం గారిని తిట్టుకున్నాడు.

ఊసూరు మంటూ తిరుగు ప్రయాణానికి అడుగులేశాడతను. ఆఫీసులో అందరతన్ని రవాణా ఖర్చుల్లో మూడోవంతు, "చాలా పెద్ద మొత్తం తెచ్చావని" ఎగతాళి చేశారు.

ఆ తర్వాతి ఆరు నెలలు, ప్రతి నెలా అదే తంతు. సుధీర్ ని పిలవడం.

యాభై ఒక్క రూపాయల చెక్కు చేతిలో పెట్టడం. రెన్నెళ్ల తర్వాత, సుధీర్ తను దైవాదీనం గారి దగ్గరకు వెళ్లనని మొండికేశాడు. అతని విరాళం కంటే రవాణా ఖర్చులు తడిసి మోపెడౌతున్నాయని వాపోయాడు. 'ప్రతి రూపాయీ మన సంస్థకు అవసరమే. మన సంస్థ పరపతి పెంచుకోవాలి కాని, ఖర్చులకు వెనకాడకూడదు, అని చైర్మన్ గారి ఆదేశం' అని మానేజర్ క్లాసు పీకి, వెళ్లమని అతన్ని బలవంతం చేశాడు.

ఏడవ నెల చెక్కు ఇస్తూ దైవాదీనం గారు "బాబూ! నిన్ను చాలా ఇబ్బంది పెట్టాను. ఏమనుకోకు. నిన్ను చూస్తే నాకు, అమెరికాలో ఉన్న నా మనవడే గుర్తుకు వస్తాడు. అందుకే నిన్నే పంపమని మీ ఆఫీసులో చెప్పాను. ఇక వచ్చే నెల నుంచి నువ్వు రానక్కర లేదు." అని ఒక కవర్లో విరాళం చెక్కు ఇచ్చారు దైవాదీనం గారు.

లోపల మంటగా ఉన్నా, పైకి మాత్రం "ధన్యవాదాలు తాత గారూ!" అని చెక్కు తన బ్యాగులో పెట్టుకొని బయల్దేరాడు సుధీర్.

చెక్కు కవర్, ఎకౌంట్స్ విభాగంలో ఇచ్చి తన పని చేసుకో సాగాడు సుధీర్. అంతలో ఆఫీసులో కలకలం.

సుధీర్ కూడా అక్కడికి వెళ్ళి చూస్తే ఏముంది? ఆ సారి దైవాదీనం గారిచ్చింది అక్షరాలా యాభై ఒక్క లక్షల రూపాయల చెక్కు! సుధీర్ కళ్లు మళ్లీ బైర్లు కమ్మాయి.

అతను మర్నాడు సొంత ఖర్చుతో, ఇంటి నుండే నేరుగా దైవాదీనం గారింటికి వెళ్లి, ఆయన తలుపు తీయగానే అమాంతంగా ఆయన కాళ్లపై పడ్డాడు. "తాత గారూ! నన్ను క్షమించండి. మీ దాతృత్వం తెలియక నేను మిమ్మల్ని మనసులో ఎంతో తిట్టుకున్నాను. మీకు ధన్యవాదాలు."

"పిచ్చివాడా. నీమీద కోపమెందుకు? నిజానికి నీ ఓపికను పరీక్షించడానికి, మీ చైర్మన్, నేను కలిసి ఆడిన నాటకమది. మా పిల్లలకు నా ఆస్తిపై ఆశ లేనందున, నా ఇన్సూరెన్స్ పాలిసీ మెచ్యూర్ అయితే వచ్చిన డబ్బు ఏదైనా పుణ్య కార్యానికి వినియోగించాలని ఎప్పుడో నిర్ణయించాను. బడిలో నా సహాధ్యాయి ఐన మీ చైర్మన్ "ఆపన్న హస్తం"ద్వారా అనాథ పిల్లలను, వితంతువులను, వయోవృద్ధులను ఆదుకుంటున్నాడని తెలిసి నా ఉద్దేశ్యం చెప్పాను. కొత్తగా సంస్థ ఉద్యోగంలో చేరిన నీ సేవాభావం పరీక్షించాలనీ, ఆయన సూచించారు.

అలా నిన్ను ఆర్నెళ్లు ఇబ్బంది పెట్టాను. ఏమనుకోకు."

"అప్పుడు మీపై విపరీతమైన కోపం వచ్చిన మాట నిజమే తాతా! కానీ ఇప్పుడది పటాపంచలైంది"

మేనేజర్ తననే దైవాదీనం గారి దగ్గరకు వెళ్లమని ఎందుకు పట్టు పట్టాడో అప్పుడర్థమైంది సుధీర్ కి.

అతను ఆఫీసుకి చేరే సరికి అతని ఉద్యోగం ఖాయం చేయడంతో పాటు సీనియర్ గుమాస్తాగా పదోన్నతికల్పించిన చైర్మన్ గారి ఉత్తర్వులు స్వాగతం పలికాయి.



-అంబల్ల జనార్దన్
సెల్:09987533225/

> "పిచ్చివాడా.. నీమీద కోపమెందుకు? నిజానికి నీ ఓపికను పరీక్షించడానికి, మీ చైర్మన్, నేను కలిసి ఆడిన నాటకమది"

# ప్రధాన వర్సిటీలకు దీటుగా అంబేద్కర్ వర్సిటీ



కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న ప్రొ.ఘంటా చక్రపాణి. వేదికపై కె. శ్రీనివాస్, అన్నవరం దేవేందర్, అల్లం నారాయణ తదితరులు.

హైదరాబాద్, అక్టోబర్ 22: (నేటినిజం ప్రతినిధి): ప్రధాన స్రవంతి యూనివర్సిటీలకు దీటుగా అంబేద్కర్ విశ్వ విద్యాలయాన్ని తీర్చిదిద్దాలనే లక్ష్యంతో పనిచేస్తున్నట్లు ఆ వర్సిటీ వీసీ ప్రొ. ఘంటా చక్రపాణి తెలిపారు. వర్సిటీలోని చావడి వేదికను సాహిత్య క్షేత్రంగా మార్చాలనే దిశగా తాము ముందుకు వెళ్తన్నామ్నారు. యూనివర్సిటీ, జీవగడ్డ మిత్రుల ఆధ్వర్యంలో శుక్రవారం జూబ్లీహిల్స్‌లోని అంబేద్కర్ వర్సిటీలో జరిగిన కార్యక్రమంలో 'అట్లనే' కవితా సంపుటిని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవగడ్డ ఉద్యమ కేంద్రమని, అక్కడి నుంచి వచ్చిన ఎంతోమంది సమాజంలో ఉన్నతస్థాయికి ఎదిగారని అన్నారు. ప్రెస్ ఆకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ మాట్లాడుతూ రచయిత అన్నవరం దేవేందర్ తెలంగాణ చరిత్రను తన కవిత్వంలో రాసారని తెలిపారు. తెలం గాణలో జరిగిన అనేక అంశాలను ప్రతిబింబించేలా ఈ కవితా సంపుటి నిలుస్తుందన్నారు. సీనియర్ జర్నలిస్ట కె.శ్రీనివాస్ మాట్లాడుతూ సరళమైన కవిత్వాన్ని మానవీయ భావంతో రాసే కవి అన్నవరం దేవేందర్ అని అన్నారు. భాషా నుడికా రంతో సరళంగా మానవ సంబంధాలపై కవిత్వం రాశారన్నారు. తెలుగుశాఖ అధ్యక్షులు ప్రొఫెసర్ ఎన్.రజని అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ ఎల్వీకే రెడ్డి, ప్రముఖ కవి అందెశ్రీ, సంగిశెట్టి శ్రీనివాస్, శ్యామ్‌ప్రసాద్, రచయిత దేవేందర్, సీనియర్ జర్నలిస్ట మంగళారాపు లక్ష్మణ్, యూనివర్సిటీ డైరెక్టర్లు, డీన్స్ టీచింగ్, నానటీచింగ్ ఫ్యాకల్టీ తదితరులు పాల్గొన్నారు.

# హక్కుల సాధనకు బీసీ సాహితీవేత్తలు గళం విప్పాలి



పుస్తకావిష్కరణలో జూలూరు గౌరీశంకర్, కె.పి.అశోక్‌కుమార్, డా॥ఎస్.రఘు తదితరులు

హైదరాబాద్, అక్టోబర్ 22: (నేటినిజం ప్రతినిధి): బీసీల ఆర్థిక, రాజకీయ సామాజిక న్యాయాల హక్కుల సాధనకు సమస్త బీసీ సాహితీ వేత్తలు గళం విప్పాలని, తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ అన్నారు. శుక్రవారం రవీంద్రభారతిలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో తెలంగాణ పబ్లికేషన్స్ ఆధ్వర్యంలో కేపీ అశోక్‌కుమార్ రచించిన **తెలుగు సాహిత్యంలో బీసీ నవల** పుస్తకాన్ని జూలూరు గౌరీశంకర్ ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీల హక్కుల సాధనపై జరుగుతున్న సామాజిక ఉద్యమంలో రచనలు చేసే చారిత్రక బాధ్యతను బీసీ కవులు, రచయితలు, సాహితీవేత్తలు తమ భుజాలపై వేసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. వందేళ్ల కాలంలో 50 మంది రచయితలు రాసిన 60 బీసీ నవలను వెలికితీసి వర్తమాన చరిత్రకు అందించిన కె.పి.అశోక్ కుమార్ కృషి బహుజన సాహిత్య ఉద్యమానికి ప్రేరణగా నిలుస్తుందన్నారు.

ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ ఎస్.రఘు, విజయభాస్కర్, పరమాత్మ, కోయి కోటేశ్వరరావు, ఏకే ప్రభాకర్, కోయ చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

# మానవి

(కథ)

నాటి తరం వారి కథలు నేటి తరానికి

**కథల వంతెన**

> “బావగారికి ఇల్లు ప్రశాంతంగా ఉండాలి కదా! మా పిల్లలు వస్తే మీ ఆయన ఇక ఇంటికి రారు. ఫ్యాక్టరీలోనే కాపురం పెట్టేస్తారు..”

ట్రింగ్.. ట్రింగ్.. ట్రింగ్.. ఆగకుండా మ్రోగుతున్న కాలింగ్ బెల్ చప్పుడికి బలవంతంగా కళ్ళు తెరిచాను. కళ్ళకి ఆ గదంతా కొత్తగా అన్పించింది. 'నేనెక్కడున్నాను..' అని గుర్తు చేసకుంటే అప్పుడు గుర్తొచ్చింది నాకు నిన్న అర్ధరాత్రి వైజాగ్ అక్కగారింటికి వచ్చానన్న సంగతి..

ఇంత ఉదయాన్నే ఎవరు బెల్ మోగించారనుకుంటూ తలుపు తీసి బయటకు వచ్చాను. 'అక్క ఏవైంది.. బావగారెక్కడా..?' అని చుట్టూ చూశాను. అప్పుడు గుర్తొచ్చింది నాకు వాళ్ళిద్దరూ తెల్లవారు ఝామునే లేచి వాకింగ్‌కి వెళ్ళారనీ.. నన్ను డిస్టర్బ్ చేయకుండా తలుపులు వేసుకొని వెళ్లిపోయుంటారు.

కాలింగ్ బెల్ సంగతి గుర్తొచ్చి అటూ ఇటూ చూస్తుంటే పై మెట్లు దిగుతూ ఒకావిడ సంచి పట్టుకొని వచ్చింది. 60 ఏళ్ళుంటాయేమో! చూడ చక్కనైన రూపం.. చామనఛాయ.. ముఖాన చిన్న విభూతి బొట్టు, చిన్న జరీ బోర్డరున్న గోధుమ రంగు చీర.. మెడలో సన్నని ముత్యాల దండ.. చూడగానే గౌరవభావం ఉట్టిపడేలా ఉంది.

'ఎవరమ్మా మీరు?' అన్నాను.

ఆవిడ నన్ను కొత్తగా చూస్తూ 'నేను ప్రతిరోజూ ఈ ఇంటావిడకి పూజకి పూలు తీసుకొని వచ్చి ఇస్తాను. ఈ రోజు కొంచం ఆలస్యమైంది. వసుధగారు వాకింగ్‌కి వెళ్ళారనుకుంటాను' అంటూ ఒక కవరులో పారిజాతాలు, ఎర్రమందారాలు, నంది వర్ధనం పూలు, తులసిఆకులువేసి నా చేతికిచ్చి 'వసుధగారికివ్వండి...' అని చెప్పి వెళ్ళిపోయింది.

'ఆ కవరు తీసుకొని లోపలికి వచ్చేసాను. ఇక నిద్ర పోవాలనిపించలేదు. బ్యాగ్ తీసి బ్రష్ తీసుకొని హాలులో ఉన్న వాష్ బేసిన్ దగ్గర బ్రష్ చేయడం మొదలెట్టాను.

'అపుడే లేచావా? అర్ధరాత్రి వచ్చావు. బాగా నిద్రపోతావనుకొని మేం అలా వాకింగ్ వెళ్ళాం. అప్పుడే ఏం తొందరొచ్చింది.. ఇంకోగంట పడకోలేక పోయావా? మీ ఇంట్లో ఎలాగూ తెల్లవారు ఝామునే లేస్తావు. 8 గంటలకే స్కూల్‌కు పరుగెడుతావు. కాఫీ తాగి మళ్ళీ పడుకో..' అంది వసుధ.

'నేను త్వరగా తయారై కాలేజీకి వెళ్ళాలి. మా వినయ్ గాడికి ఇంటర్ అప్లికేషన్ తీసుకొని వివరాలన్నీ కనుక్కొని వస్తాను...' అన్నాన్నేను.

“సరే! నీ ఇష్టం. ఎప్పుడొచ్చినా ఇలా వచ్చి, అలా వెళ్ళిపోతావ్. పిల్లల్ని కూడా తీసుకొస్తే బాగుండును. నాలుగు రోజులు సరదాగా గడిపేవారు..” దోసెలువేస్తూ అంది.

“వాళ్ళని నువ్ భరించలేవే బాబూ! వాళ్ళు పిల్లలు కాదు పిడుగులు. వినయ్ గారు ఇంటర్‌లోకి వస్తున్నా వాడి అల్లరి తగ్గలేదు. చిన్నాడు వినీత్ సంగతి చెప్పక్కర్లేదు. ఇల్లు పీకి పందిరి వేస్తాడు. బావగారికి ఇల్లు ప్రశాంతంగా ఉండాలి కదా! మా పిల్లలు వస్తే మీ ఆయన ఇక ఇంటికి రారు. ఫ్యాక్టరీలోనే కాపురం పెట్టేస్తారు..' నవ్వుతూ అన్నాను నేను.

మాది చక్రధరపూర్. మా వారు రైల్వేలో ఇంజనీరుగా పనిచేస్తున్నారు. నేనూ అక్కడే ఒక ప్రైవేటు స్కూల్‌లో టీచర్‌గా చేస్తున్నాను. ఇద్దరూ మగపిల్లలే. పెద్దవాడు వినయ్‌ది టెన్త్ పూర్తయింది. అక్కడ ఇంటర్ మీడియట్‌లో జాయిన్ చెయ్యడం ఇష్టం లేక వైజాగ్ హాస్టల్‌లో పెట్టి చదివిద్దామనీ అనుకున్నాం. ఆయనకి ఖాళీలేక పోవడంతో నేను వైజాగ్ రావలసి వచ్చింది.

కాలేజీకి వెళ్ళాను. అక్కడ ఒక తిరణాళ్ళలా వుంది. అప్లికేషన్స్ తీసుకునే వాళ్ళు. అక్కడే పూర్తి చేసేవాళ్ళు. హాస్టల్ వివరాలడిగే వాళ్ళతో ఆ ప్రాంతమంతా కళకళ లాడిపోతోంది. అమ్మాయిలు, అబ్బాయిలు తల్లిదండ్రులవచ్చి కాలేజీ అంతా కలయదిరుగుతున్నారు. సందడే సందడి..! నేను అన్ని వివరాలు కనుక్కొని ఇంటికి వచ్చాను.

ఆటో దిగి ఇంట్లోకి వచ్చేసరికి వసుధ ఉదయం పూలు తెచ్చినావిడతో మాట్లాడుతోంది. నన్ను చూసి..

“రావే ఇప్పుడే నీ గురించి చెప్తున్నాను. నువ్వు అరిసెలు, జంతికలు కావాలన్నావు కదా! ఈవిడ చాలా బాగా చేస్తారు. అన్నట్టు చెప్పడం మర్చిపోయాను. ఈవిడ పేరు శాంతమ్మ. మన వీధిలోనే ఉంటున్నారు. చాలా మంచావిడ. మా అపార్టుమెంటులో అందరికీ పూజకి పూలు ఈవిడే ఇస్తారు. పుణ్యమంతా ఈవిడదే. ఈవిడ పూలు తీసుకు రాకపోతే ఆ రోజు మా దేవుడి మందిరం వెలవెలబోతుంది. నీకు కావాల్సిన పిండి వంటలు చేసిస్తారు..' అంటూ 'శాంతగారూ! మీరు రేపు ఉదయం 10 గంటలకల్లా వచ్చేయండి. కావాల్సిన సామన్లన్నీ తెప్పించి ఉంచుతాను..' అంది వసుధ.

'సరేనమ్మ! ఉదయం వస్తానంటూ' శాంతమ్మ వెళ్ళిపోయింది.

'అక్కా! ఈవిడెవరే? ఇంతకు ముందెప్పుడు ఇక్కడ చూళ్ళేదు. మనిషిని చూస్తే బాగా బ్రతికినావిడలా వుందే..' ఆరాగా అడిగాను.

'నిజమేనే! ఆవిడ బాగా బ్రతికినావిడే.. పాపం.. వాళ్ళాయనకి కేన్సర్ వచ్చి పోయాడట. ఆయన రోగానికే చాలా డబ్బు ఖర్చయిపోయిందట. ఒక్క కొడుకు కష్టపడి వాడిని ఎమ్.బీ.యేలో చేర్పించిందట. చదువు పూర్తయ్యాకా అబ్బాయి స్నేహితుల్తో కలిసి పిక్నిక్‌కి వెళ్ళాడట. దారిలో యాక్సిడెంట్ అయి అక్కడికక్కడే చనిపోయాడట. పాపం! ఈవిడని చూస్తుంటే బాధేస్తుంది. అయిన వాళ్ళు ఉన్నా ఎవరికేం పట్టనట్టు ఉంటారు. ఈ వీధి చివర్లో ఒక గది అద్దెకు తీసుకొని ఉంటోంది. ఎవరినీఏమీ అడగదు. ఎవరికేమీ సహాయం కావాలన్నా చక్కగా చేసిపెడుతుంది.

ఉదయాన్నే లేచి నాలుగు వీధుల్లో పూలు కోసుకొని వస్తుంది. ఈ అపార్ట్‌మెంట్ చూసావుగా.. పెద్ద మొక్కలు పెంచే భాగ్యంలేదు. చిన్నచిన్న కుండీలల్లైనే పూల మొక్కలు.. బావగారు రోజూ పూజ చేస్తారుగా.. ఆయనకి చాలా పూలు ఉండాలి. మాటల సందర్భంలో పూజకి పూలు కొరత గురించి చర్చకువచ్చింది. అప్పుడు అక్కడే ఉన్న శాంతమ్మగారు 'దానికేం భాగ్యమమ్మా! నేను రోజూ పూలు తెచ్చిస్తానన్నారు... 'మా అపార్టుమెంట్‌లో చాలా మందికి రకరకాల పూలు పూజకి తెచ్చి ఇస్తుంది. ఎవరు ఏమిచ్చినా తీసుకోదు.. దేవుడి కోసం ఇదోసేవ అంటుంది.

> “ఆ శవం ఇంక అక్కడే ఉందమ్మా! అందరూ వచ్చి చూసి పోతున్నారు. చాలా మంచిదమ్మా..! అందరూ ఆవిడ గురించే పొగుడుతున్నారు. ఎవ్వరూ లేరు. దిక్కులేని చావు వచ్చిపడింది”

ఏదైన పిండి వంటలు వండేటప్పుడు సాయం చేస్తుంది. ఒక వంద చేతిలో పెట్టాను. మొదట్లో వద్దని చాలా గొడవ చేసేది. కానీ మేమంతా బలవంతపెడితే తీసుకుంటోంది. ఏంటో! ఆ దేవుడు మంచి వాళ్ళకే కష్టాలు పెడతాడు...' ఆవేదనగా అంది వసుధ.

మర్నాడు అన్నటైమ్‌కి వచ్చి చాలా ఓపిగ్గా, చక్కగా అన్నీ వండి పెట్టింది శాంతమ్మ. నేను బ్యాగ్ తీసి రెండు వందలు ఇవ్వబోతే ఆవిడ చాలా బాధపడింది. 'వసుధగారి చెల్లెలు మీరు. ఏదో నాకొచ్చింది చేసి పెట్టాను. ఈ పనికి వెల కట్టకండి మా అమ్మాయికి వండి పెట్టాన నుకుంటాను..' అంటూ అభిమానపడి వెళ్ళిపోయింది.

ఆవిడ మాటలకి నేను సిగ్గుపడ్డాను. 'ఇలా డైరక్టుగా డబ్బు ఇవ్వకుండా ఉండాల్సింది. ఏ చీరైనా కొనిచ్చి ఉంటే బాగుండేది..” అనుకుంటూ ఆ డబ్బు అక్క చేతికిచ్చి ఆవిడకేదైనా చీర కొనివ్వమన్నాను.

ఆ రాత్రి సరిగ్గా నిద్ర పట్టలేదు. శాంతమ్మగారి గురించే ఆలోచనలు. భర్త, బిడ్డ, పోవడం ఒంటరి జీవితం.. నిజంగా ఆవిడది చాలా దయానీయమైన జీవితం. అభిమానం కలది కాబట్టి ఎవరి నుంచీ ఏమీ ఆశించకుండా తన బ్రతుకేదో తను బ్రతుకుతోంది . ఆవిడకి రేపటి రోజు ఎలా గడుస్తుంది? అన్న దిగులు లేదు. అన్నిటికీ దేవుడున్నాడు అని సరిపెట్టుకుపోతుంది. ఆరోగ్యంగా ఉంది కాబట్టి ఫరవాలేదు రేపు అనారోగ్యం వస్తే ఎవరు చూస్తారు? అసలెందుకు నేను ఆవిడ గురించి అంత ఆలోచిస్తున్నాను? అని నన్ను నేను ప్రశ్నించుకున్నాను. మా అమ్మ అదే వయసులో చనిపోయింది. ఆ భావనేమో! ఏమీ అంతుబట్టడం లేదు. కాని ఏదో తెలియని బంధం. అది మానవీయ బంధమేమో! అనిపించింది.

ఆవిడకేదైనా చెయ్యాలనిపించింది. పోనీ చక్రధరపూర్ తీసుకువెళ్తే ఎలా ఉంటుంది? అని ఆలోచించాను. సరిగ్గానే అన్పించింది. ఇంట్లో తోడుగా ఉంటుంది. ఇంటికి పెద్ద దిక్కు గానూ ఉంటుంది. మా అత్త మామలుపోయి చాలా కాలమైంది. ఇంట్లో పెద్దవాళ్ళుంటే మంచీ చెడ్డ చక్కగా చెప్తారు. ఆవిడని ఎలాగైనా ఒప్పించి తీసుకు వెళ్ళాలి. అని నిశ్చయించుకున్నాను. రేపు ఉదయం వచ్చినప్పుడు అడగాలనుకున్నాను. ఎల్లుండి తిరుగు ప్రయాణం. ఇలా ఆలోచిస్తూ నెమ్మదిగా నిద్రలోకి జారిపోయాను.

పూజ గదిలో గంట మోతకి మెలకువ వచ్చింది. 'అప్పుడే తెల్లారిపోయిందా!' అనుకుంటూ బయటకు వచ్చాను. 8 గంటలు అయింది. 'ఇంత మత్తుగా నిద్రపోయానా?' అనుకుంటూ బ్రష్ చేసుకుని వంట గదిలోకి వెళ్ళి చూసా. అక్క అప్పటికే టిఫిన్ రెడీ చేసి బావగారికి పెట్టోంది. బావగారికి అన్నీ టైం ప్రకారం జరగాలి. షుగర్ పేషెంట్.. అన్నీ అమర్చి ఆయన్ని సాగనంపింది. ఈలోగా నేను స్నానం చేసి రెడీ అయి దేవుడికి దణ్ణం పెట్టుకుందామని పూజగదిలోకి వెళ్ళాను.

పూజా మందిరం బోసిపోయింది దేవతా మూర్తులకి అలంకరణ లేదు. 'ఈ రోజు శాంతమ్మగారు పూలు తీసుకురాలేదేమో...' అనుకున్నాను. రాత్రి నేను అనుకున్నవన్నీ గుర్తొచ్చాయి. అక్కతో మాట్లాడాల నుకున్నాను.

'ఏమిటే.. అప్పుడే స్నానం కూడా కానిచ్చేసావా? ఉండు టిఫిన్ పెడతాను..' ప్లేటు తీస్తూ అంది వసుధ.

ఆ రోజు శాంతమ్మపువ్వులు తీసుకురాలేదా?' అడిగాను.

'ఏమయ్యిందో ! ఈ రోజు ఇంత ప్రొద్దెక్కినా రాలేదు. ఎప్పుడూ తెల్లారే సరికి గుమ్మంలో పువ్వుల్తో ప్రత్యక్ష మయ్యేది. మా పనిమనిషి వచ్చాక చూసి రమ్మంటాను...' అంది వసుధ.

హడావుడిగా పరుగెత్తుకొచ్చింది పని మనిషి. ఏదో కంగారుగా ఉంది. నోట్లోంచి మాట రావడం లేదు. ఒగరుస్తుంది.

'ఏంటే! అలా వున్నావ్.. ఒంట్లో బాగోలేదా? ఏంటలా కంగారుగా వున్నావ్? ఏం జరిగిందని అక్క అడుగుతుండగానే బావురుమని ఏడ్చేసింది. ఏం జరిగిందో అర్థంగాక మేమిద్దరం ముఖాలు చూసుకున్నాం. ఓ గ్లాస్ మంచినీళ్లు తెచ్చి పనిమనిషికిచ్చాను. గడగడ తాగేసింది.

'ఆ దేవుడికి దయలేదమ్మ! ఎంత అన్యాయం? ఎంతఅన్యాయం.. జరిగిపోయింది.. ' అంటూ మళ్ళీ ఏడుపు లంఘించుకుంది.

'ఏమయ్యిందో చెప్పవే ముందు..' ఆత్రంగా అడిగింది అక్క.

'ఇంకేం కావాలమ్మా! ఆ మాయదారి దేవుడు మన శాంతమ్మగారిని తీసుకుపోయాడమ్మ..!' అని బావురుమంది.

మేమిద్దరం నిశ్చేష్టులమయ్యాం 'ఆవిడ పోవడం ఏంటీ? నేనుసరిగ్గానే విన్నానా?' అనుకుంటూ ఏం జరిగిందో వివరంగా చెప్పు' అన్నాను ఆదుర్దగా..

అక్క ఒక పక్కకి చతికిలబడిపోయింది. ఏదైనా వింటే తను తట్టుకోలేదు. తనకీ ఒక గ్లాస్‌తో నీళ్ళిచ్చి తాగమన్నాను.

“ఏం చెప్పనమ్మా! ఘోరం జరిగిపోయింది. ఆ శాంతమ్మ గారు రోజులాగే తెల్లారుఝామున పూలు కొయ్యడానికి వెళ్ళారంటమ్మా! చాలా మంది వాకింగ్‌కి వెళ్తన్నవాళ్ళు ఆవిడ పూలు కోస్తుంటే చూసారట. ఏం జరిగిందో ఉన్న ట్టుండి పడిపోయిందట. అక్కడ వాళ్ళు చూసి 108 అంబులెన్స్‌కి ఫోన్ చేసారంట. వాళ్ళు వచ్చి చూసి చనిపోయారనీ చెప్పారంట. హార్టు ఎటాక్ అంటమ్మా!' అంటూ కళ్లనీళ్లు ఒత్తుకుంది.

'ఇప్పుడు ఆవిడ ఎక్కడ ఉంది?' ఆత్రంగా అడిగాను.

'ఆ శవం ఇంక అక్కడే ఉందమ్మా! అందరూ వచ్చి చూసి పోతున్నారు. చాలా మంచిదమ్మా..! అందరూ ఆవిడ గురించే పొగుడుతున్నారు. ఎవ్వరూ లేరు. దిక్కులేని చావు

2011లో రాసిన కథ

వచ్చిపడింది. మా దొడ్డ మనిషమ్మా..' అంటూ ముక్కుచీదింది తాయారు.

అక్క తను వెళ్ళి చూసి వస్తానని బయల్దేరింది. నేను కూడా వస్తానని బయల్దేరాను. ఒక ఫర్లాంగ్ దూరంలో రోడ్డు ప్రక్క జనం చాలా మంది గుమిగూడి ఉన్నారు. నేను, అక్క గబగబ నడుచుకుంటూ వెళ్ళాం. నిర్జీవంగా శాంతమ్మ.. ప్రశాంతంగా నిద్రపోతున్నట్టు ఉంది. ఒక్క రోజు పరిచయం. కానీ ఆవిడ ఎప్పటి నుండో తెలిసిన మనిషి అన్పించింది. “ఏం బంధమిది?” అనుకున్నాను. పారిజాతం పువ్వులు ఏరుతుంటే నొప్పి వచ్చి పడిపో యిందేమో? ఆవిడ శరీరం నిండా పువ్వులు వెదజల్లినట్టు రాలిపడి ఉన్నాయి. పువ్వులకి ఆవిడకి ఎంత గొప్ప బంధం? రోజూ ఆ పువ్వుల్ని దేవుడికి అర్పించేందుకు ఏరుకొని వెళ్ళేది. తమకి అంత పుణ్యం దక్కేలా చేసిన ఆవిడ ఋణాన్ని ఆ పారిజాతాలు తీర్చుకున్నాయా? అన్నట్టుగా ఆవిడ పార్థివ శరీరం మీద పూలు కన్నీళ్ళులా వర్షిస్తూనే ఉన్నాయి.

(జ్వలిత సంపాదకత్వంలో వెలువడిన “ఖమ్మం కథలు” నుండి...)

---



-డా॥రావి రంగారావు
9247581825

ఈ వారం అంశం: వాళ్లు పరుగులు తీస్తున్నారు
పేస్ బుక్ “అమరావతి సాహితీ మిత్రులు” గ్రూపులో డావ రావి రంగారావు 2024 నుండి నిరంతరాయంగా నిర్వహిస్తున్న వారం వారం కవితల వర్క్ షాపులు.
“వారం వారం కవితల వర్క్ షాప్” 36కు మొత్తం 16 మంది కవులు తమ కవితలు పోస్ట్ చేశారు. 7 కవితలకు ప్రశంసా పత్రాలు లభించాయి.

## వచన కవితలు

### పరుగులే పరుగులు

అత్యాశల ఎండమావుల వెంట
వ్యామోహాల ముళ్ళ దారుల వెంట
వ్యసనాల ఆకర్షణ మాయల వెంట
అర్థం లేని అహంకార ఉద్వేగాల వెంట
వాళ్ళు పరుగులు తీస్తున్నారు,
ఆత్మీయ బంధాలు తెంచుకుని
నీతి సూత్రాల కట్టు దాటుకుని
మానవతా విలువలు మంట కలిపి
విచక్షణకు తిలోదకాలిచ్చి
వాళ్ళు పరుగులు తీస్తున్నారు,
అవినీతి అగాధపు లోయల వైపుకి
అక్రమాల చీకటి మాయల వైపుకి
మాదక ద్రవ్య సరఫరా లాభాలకి
కల్తీ సరుకుల కాలుష్యానికి
వాళ్ళు పరుగులు తీస్తున్నారు,
కృత్రిమ మేధతో పనులు చక్కపెట్టడానికి
సముద్రాలపై పెత్తనం చేయడానికి
ప్రపంచానికి అణుభయం పుట్టించడానికి
రోదసిలో సామ్రాజ్యాలు స్థాపించడానికి
వాళ్ళు పరుగులు తీస్తున్నారు

-అనుముల బదరీనారాయణ,

### వాళ్లు పరుగులు తీస్తున్నారు

చదువు కోసం
కొలువు కోసం
చదువు కొలువుల మధ్య
సంఘర్షణ కోసం
ఎవరి దారుల్లో
వాళ్లు పరుగులెడుతున్నారు,
కులం కోసం మతం కోసం
కుల మతాల మధ్య వివాదాల కోసం
ఎవరి దారుల్లో
వాళ్లు పరుగులు తీస్తున్నారు
కాసు కోసం కీర్తి కోసం
విలాసవంతమైన జీవితం కోసం
బంధాలకు బహుదూరంగా
ఆకాశమార్గాలలో
పరుగులెడుతున్నారు
ఆక్రమణ కోసం అవినీతి కోసం
స్వార్థపు కాళ్లను తగిలించుకుని
ఎవరి దారుల్లో
వాళ్లు పరుగులు తీస్తున్నారు.
పదవుల కోసం అధికారం కోసం
ఓటుకి ఉసురు తీసి
ఎవరి దారుల్లో
వాళ్ళు పరుగులు తీస్తున్నారు.
అలసి సొలసి
పరుగులెత్తిన దేహాలన్నీ
ఎక్కడో ఒక దగ్గర ఆగిపోతాయి
అక్కడ పరుగులు ఊసే ఉండదు
అంతా ... విశ్రాంతే.

- జాగరపు శంకరరావు

### పరుగులు తీస్తూనే ఉన్నారు

మార్కులు ర్యాంకులంటూ
ఆటపాటలకు దూరంగా విద్యార్థులు ..
ఉద్యోగాలు వ్యాపారాలంటూ
ఒకరికొకరు దొరక్కుండా ఆలుమగలు,
న్యాయ దేవతకు కనబడకుండా
పెరోల్ పై కరుడుగట్టిన నేరస్థులు ..
ప్రభుత్వ బ్యాంకులకు దొరక్కుండా
విదేశాలకు ఆర్థిక నేరస్తులు.
ప్రజలను కులమత వర్గాల వారీగా
విభజించేందుకు నాయకులు ..
ప్రజాస్వామ్యాన్ని పేరుకే పరిమితం
చేసేందుకు పాలకులు.
తరాలు మారినా తలరాతలు
మారని నిరుపేదల సాక్షిగా ..
తరతరాలకు సరిపడా సంపద
పోగేసుకునేందుకు సంపన్నులు.
ఫాస్ట్ ఫుడ్ మోజులో పడి
పౌష్టికాహారాన్ని అటకెక్కిస్తూ ..
వేధిస్తున్న జీవనశైలి వ్యాధులతో
ఆసుపత్రుల చుట్టూ రోగులు.
గతం తాలూకూ బాధలతో
భవిష్యత్తు గురించి భయాలతో ..
వర్తమానంలో అసలు ఏమాత్రం
బ్రతక్కుండానే వాళ్ళు వీళ్ళు
అలా పరుగులు తీస్తూనే ఉన్నారు

-టి. ధనుంజయ రెడ్డి.

### పరుగులు

కంటి చూపుతోనే చంటోడి ఆకలి
కనిపెట్టే కన్నతల్లిలా
పట్టెడన్నం జీవరాశికి పెట్టేందుకు
సుఖమెరుగని కష్టజీవై
కటిక నేలను కల్పతరువును చేసేందుకు
వాళ్లు పరుగులు తీస్తున్నారు!.
దేశ క్షేమం కోసం ప్రాణ దాతలై
భరత మాత శౌర్యాన్ని
తను వంతా కప్పుకొని
శత్రుమూకల పిసరణచగా
చైతన్య సూర్యులై
వాళ్లు పరుగులు తీస్తున్నారు!.
అరుదైన అందాలతో
పుడమి తల్లి గుణగణాలను
పుణికి పుచ్చుకొని
ఓర్పు సహనాలకు బాట వేస్తూ
బంధాల బాధ్యతలకు
అందాల యువరాణులై
వెలుగొందే గృహిణులై
వాళ్లు పరుగులు తీస్తున్నారు!.
సకల విద్య అస్త్రాలతో
త్రిమూర్తిలా అవతరించి
సకల ప్రపంచాలకు
అక్షర జ్ఞానం నాటేందుకు
నాటిన జ్ఞానం పండేందుకు
మనుజ రూపం దాల్చి
వాణి తేజస్సులై
వాళ్లు పరుగులు తీస్తున్నారు!.
జగన్నాథ రథచక్రాలై
ధర్మాన్ని నడిపించాలని
ప్రజలను కంటిపాపలా కాపాడాలని
నిస్వార్థ నాయకులుగా
చైతన్యమై వెలగాలని
వాళ్లు పరుగులు తీస్తున్నారు!

-చల్లా సత్యవతి

### అలుపెరగని పోరాటాలు

వాళ్లు పరుగులు తీస్తున్నారు?
ఆకాంక్షల గమ్యాన్ని చేరాలనే తపనతో,
చదువుల భారం భుజాన వేసుకుని,
ఉద్యోగాల వేటలో అడుగులు వేస్తున్నారు.
తల్లిదండ్రుల కళ్లలో మెరిసే ఆశ,
వారికోసం శ్రమించే పిల్లల శ్వాస,
ప్రతి పుటలో చెమట చుక్కలు,
ప్రతి రాత్రి ఒక పరీక్షా పర్వం.
కాగితంపై కలం గీతలు,
హృదయంలో కలల జాడలు,
స్నేహితుల ఆటలు దూరమై,
కోచింగ్ క్లాసులే వారి పల్లకీ.
ఒక విజయం వెనుక వేల విఫలాలు,
ఒక ఆశ వెనుక నూరు నిరాశలు,
అయినా అడుగు వెనక్కి వేయరు,
జీవితమనే రణరంగంలో తలవంచరు.
కొందరికి విజయపు తలుపు
వెంటనే తెరుచుకుంటుంది,
కొందరికి ఆ తలుపు తట్టాలంటే
ఎన్నో సంవత్సరాలు పడుతుంది,
అయినా వాళ్లు పరుగులు ఆపరు,
ఆ గమ్యం చేరకముందు ఊపిరి తీయరు.
కాగితం పైనే కాదు,
జీవితపు బాటలోనూ ఎదుర్కొంటారు పరీక్షలు,
అనుభవం అనే గురువుద్వారా,
పలు విఫలాలతో నేర్చేరు పాఠాలు.
వాళ్లు పరుగులు తీస్తున్నారు?
కేవలం తమకోసం కాదు,
సమాజం గర్వించాలనే ఆశతో,
తమ తల్లిదండ్రుల తల
ఎత్తేలా చేయాలనే తపనతో.
పరుగులు ఆగకూడదు,
కలలు మసకబారకూడదు,
వారి కృషి రేపటి సూర్యోదయం,
వారి శ్రమే భవిష్యత్తు విజయగాథ.

-రాజ్యలక్ష్మి శశిధర్ కె.

### వాళ్ళు పరుగులు తీస్తున్నారు ..

మహా నగరం బద్ధకంగా
ఒళ్ళు విరుస్తూ నిద్ర లేస్తోంది?.
తెల్లటి ఎత్తైన
రాతి వనాల మధ్యనుండి
ప్రాతః కాలపు
ఎర్రటి సూర్యుని కిరణాలు
భూమికి సమాంతరంగా
ప్రసరిస్తూ,
దొరికిన సందుల గుండా
జనారణ్యం లోకి
తొంగి చూస్తున్నాయి..
పిల్లకాలువల ప్రవాహంతో
నిండుతున్న గోదారిలాగ
చిన్న గల్లీల నుండి క్రమంగా
రోడ్లపైకి చేరుతూ
పెరుగుతున్న జనప్రవాహం..
పసిపిల్లలతో నిండిన
స్కూలు బస్సులు, ఆటో లు
రోడ్లపై నిండు గర్భిణీలా
అడుగులేసుకుంటూ పోతుంటే.
దూరంగా ఉన్న
ఆఫీసులకి చేరడానికి
తమ తమ వాహనాలతో
ముందుకు కదులుతున్న
ఉద్యోగుల వరుస..
యుద్ధానికి వెళుతున్న
సైనికుల కవాతును తలపిస్తుంది ..
నగర పొలిమేరల్లో కట్టిన
కాలేజీ బస్సుల కోసం
రంగు రంగు ల సీతా కోక
చిలుకల్లా టీనేజ్ విద్యార్థులు..
బస్ స్టాపు ల్లో చేసే హడావుడి
హైటెక్స్ మంటపంలో వీఐపీ ల
శుభకార్యాల వేడుకకి విచ్చేసిన
ముఖ్య అతిథుల
కోలాహలంలాగా ఉంది..
ఇంకొక పక్క ?.
నాగరిక త పెరిగి
వ్యవసాయం తరిగి
పొట్ట చేత పట్టుకుని
చెమటనే నమ్ముకుని.
తల్లి లాంటి పల్లెను వదలి
నగర జనారణ్యం లోకి
వలస వచ్చిన శ్రమ జీవుల అడ్డా
..
అడవి లో అక్కడక్కడా
కన్పించే చలి చీమల
గుంపుని తలపిస్తుంది..
ఇదీ నేటి భారతం?
దేనికీ తీరిక లేని నగర జనుల
యాంత్రిక జీవన విధానం..
ఇది?.
కాలం తో పరుగులు తీస్తున్న
మర మనుషుల ప్రపంచం .

-శ్రీనివాస శాస్త్రి

### పరుగులు


వాళ్లు పరుగులు తీస్తున్నారు
కాలం వెనకా? కలల వెనకా?
కలిసిన మబ్బుల్ని చేతులతో
పట్టుకోవాలన్న తపనలా...
వాళ్లు పరుగులు తీస్తున్నారు
మొగలి తోటలో పాముల్లా
రేపు అందనిదని తెలిసినా
రేపటిని వెంబడిస్తూ..
వాళ్లు పరుగులు తీస్తున్నారు
నిశ్శబ్దం కరిగే వరకు,
హృదయ స్పందన
గీతలు మారేవరకు...
వాళ్లు పరుగులు తీస్తున్నారు
కళ్లలో కన్నీటి బిందువులు మెరిసినా,
హృదయం గాయాలతో నిండినా,
అడుగులు మాత్రం ఆగకుండా...
వాళ్లు పరుగులు తీస్తున్నారు
విధి వేసిన బంధాల్ని చీల్చి,
రాత్రి గోడల్ని దాటి
ఉషోదయాన్ని చేరుకోవాలని...
వాళ్లు పరుగులు తీస్తున్నారు
గతం గాయం చేసిన దారులపై,
కొత్త బలం పుంజుకుంటూ
కొత్త ఆశల సునామీ కోసం...
వాళ్లు పరుగులు తీస్తున్నారు
విషాదాన్ని భుజానేసుకుని,
ప్రేరణను హృదయంలో దాచుకుని,
క్రాంతి కిరణం కోసం వెతుకుతూ...
వాళ్లు పరుగులు తీస్తున్నారు
ఆగని తుపానుల మధ్య,
అలసిన శరీరంతోనూ
అజేయమైన మనసుతోనూ.
విషాదమే మార్గమైతే,
ప్రేరణే వారి గమ్యం అనుకుంటూ..
వాళ్లు పరుగులు తీస్తున్నారు
ఆశల సౌధం అందుకోవాలని...

-శరకణం కనకదుర్గ
గుంటూరు ..

---

# వీరశైవ సిద్ధాంత దర్శిని

పుస్తక సమీక్ష




**ప్రతులకు:** చల్లా రామారావు
పురోహితులు, శివాలయం వద్ద
రావూరిపేట గ్రామం. వేటపాలెం పోస్టు-523 187
ప్రకాశం జిల్లా. ఆంధ్ర

దేవర దాసిమయ్యయను వారు కన్నడ రాష్ట్రమునందు వీరశైవ వ్యాప్తికి కృషి చేసినవారు. ముఖ్యంగా వీరు, వారి ఆలోచనలను రచనల రూపంలో సమాజానికి అందించి, సమాజ శ్రేయమును కోరినవారు. దాసిమయ్య గారు బోధించిన పలు విషయాలను సేకరించి, వీరశైవ సిద్ధాంత బోధనామృతమనెడి గ్రంథాన్ని వ్రాసి, వెలువరించారు శ్రీ చల్లా రామారావుగారు.

వీరు విద్యావేత్త, జ్యోతిష శాస్త్రాన్ని అధ్యయనం చేసిన వారు. వీరశైవ దేవర దాసిమయ్య గురు పీఠాన్ని ఏర్పరచి, పీఠాధిపతిగా వ్యవహరిస్తున్నారు. దేవర దాసిమయ్య వచనామృతాన్ని తెలుగు ప్రజల ముంగిళ్ళలో వంపి, ప్రజల పరం చేయవలెననెడి తపనలో పరిశ్రమిస్తున్నారు.

అమూల్యమైన ఈ గ్రంథంలో 56 అంశాలను విశ్లేషించారు రచయిత. శివ పరమాత్మ ఎవరని చర్చిస్తూ, ఈ సృష్టి అంతయు పరమాత్మ యొక్క ప్రణాళిక ప్రకారం ఏర్పడిందంటారు. సృష్టిలోని జీవరాశులన్నియు దేనికవి భిన్నముగా కనిపించినా, వాటి యందు భగవంతుని అంశ స్వరూపమై వ్యాపించి ఉందంటారు.

దేవర దాసిమయ్య ఇష్టదైవము రామనాథుడు. అతడే అన్నిటికీ మూలం అంటాడు. ఎవ్వరూ చేయలేని అద్భుత కార్యముల నిర్వహణ చేయువాడు ఆ పరమాత్మ ఒక్కడే అన్న సత్యాన్ని గుర్తు చేస్తాడు. భూమి సముద్రం నీటనే వుంటుంది. కాని, అది కరగదు. అటులనే ఆకాశం భూమికి పైన కప్పువలె ఉంటుంది. ఏ ఆధారము లేకున్నను నిలిచి వుంటుంది.

దైవారాధన అనేది స్వయంగా చేయాలంటాడు దాసిమయ్య. ఎవరి ఆకలి తీరాలంటే వారే భోజనము చేయాలి గాని దైవాన్ని ఆరాధించాలి అంటాడు. కర్మ, కర్త, క్రియ ఆయనే సర్వత్ర నిండి వున్నాడు. పరమాత్మ ఎవరివైపుకు తిరిగి చూడడు అంటాడు దాసిమయ్య. గురువును పరమాత్మకు ప్రతి రూపంగా భావించమంటాడు. గురువుకు అత్యంత గౌరవ ప్రదమైన స్థానాన్ని ఇచ్చాడు దాసిమయ్య.

శాశ్వత ధర్మాత్ముడంటూ ఈ భూమి మీద ఎవరూ లేరంటారు. ప్రజలను బాధలకు, హింసలకు గురి చేసే వారిని దుష్టులుగా ఈ సమాజం నిరశిస్తుంది. పరమాత్మను కాదని, ఆయనచే సృష్టించబడిన దేవతలను పూజించుట తగని పనిగా చెప్పబ డింది. మనుషులు, వారు చేసెడి కార్యములన్నింటికి ప్రేరణ యిచ్చేది పరమాత్మ మాత్రమే అంటారు. పరమ శివుడే సృష్టికర్త.

ఇలా అనేక ప్రశ్నలకు సమాధానాలు చెప్పటం ద్వారా దాసిమయ్య సిద్ధాంతం అవగతం చేసుకోగలము. రగిలే నిప్పుపై ఎండిగడ్డి వేసినచో కాలి బూడిదయగును. దేహ రూపంలో వున్న గడ్డిని గురువు పాదముల కర్పిస్తే పవిత్రత చేకూరును అంటారు. గురువు చేయు బోధల మూలంగా ముక్తిమార్గము లభించి, పయనం సులభతరం అవుతుందంటారు.

ప్రపంచమంతా పరమాత్మతో నిండి వుంది. సర్వవ్యాప్తము పర మాత్మ.

అంటే పరమాత్ముడి స్వరూపం అందరి లోనూ వుంటుంది. అందువలన జీవు లందరూ సమానమే. ఆ విశ్వ రహస్యాన్ని చెప్పేందుకు దాసిమయ్య తన అనుభ వాన్ని జోడించి బోధించాడు. వీర శైవానికి అంకిత మైన దేవర దాసి మ య్య మనుషుల భావి జీవితానందం కోసం బోధించిన అనేక అంశాలను ఈ గ్రంథంలో రచయిత సమగ్రంగా వివరించారు.

-ఎస్.ఆర్ పృథ్వీ
9989223245



---

## ఆ'పాత' ఊరి ఊసులు

నులక మంచంలో సేద తీరడం
కోడి కూతలతో నిద్ర లేవడం
చేద బాయిలోంచి నీళ్లు తోడడం
పిడిక బొగ్గుతో పండ్లు తోమడం !.

చిందు నాటకాల చమత్కారాలు
చిర్రగోనే ఆటల చిలిపి చేష్టలు
పానాదుల వెంట పండ్ల వేటలు
పూల బతుకమ్మ సింగిడి రంగులు !.

వరి గొలుసులకు వేలాడే పిచ్చుకలు
చిలక కొట్టిన మామిడి పండ్ల రుచులు
మంచె ఎక్కి పక్షుల్ని తరుమడాలు
చెరువుల్లో వచ్చీరాని ఈతల వెతలు !.

కాల్చిన తాటి పండ్ల మధుర రసాలు
తాటి ముంజలకు గౌడన్న ప్రసన్నాలు
తాటి గేగుల్లోని బహు తియ్యటి గుజ్జులు
ముళ్లు గుచ్చినా పరికి పండ్ల వేటలు !.

ఊరంతా వావివరుసల అల్లికలు
సుఖ దుఃఖాల్లో వాడంతా తనోళ్లే
వాగుల్లో చెలిమె నీళ్ళ స్వచ్ఛ రుచులు
అలుగు దునికిన చెరువుల్లో చేపలు !.

బడిలో చెప్రాసీని చూస్తేనే భయాలు
తప్పు చేస్తే పంతులు బెత్తం వాతలు
గోడ కుర్చీలతో గగ్గోలు పెట్టిన రోజులు
తలరాతను మార్చిన నాటి దెబ్బలు !.

పాజీల్లో ఎరవేసి పట్టిన కంజు పిట్టలు
ఎర్రల గాలాలు వేసి పట్టిన చేపలు
ఇంటి చుట్టు కోళ్ల ఫ్యాషన్ పరేడ్లు
బర్రెపాల నురగలతో నిద్రలేచే ఊళ్లు !.

కట్టెల పొయ్యి గంజి కూడా తీయ్యన
పందిరి కింద గోలీల ఆటలు జోరున
పెరట్లో తిన్న టమాటా పండ్లు కమ్మన
కష్టసుఖాల కలబోత ఊరంతా చక్కన !



- మధుపాలీ
9949700037

# యాత్రాస్థలాలను దృశ్యమానం చేసిన రచయిత్రి

షామీర్ జానకీదేవిగారు ఇంతకు ముందు **'కంచిగరుడసేవ'** పేరుతో కథా సంపుటిని ప్రచురించారు. అది తొలి పుస్తకం. ఆ తరువాత కూడా ఆవిడ కథలు ప్రచురితమవుతూనే ఉన్నాయి. ఇప్పుడు రెండవ పుస్తకంగా **'మేము–మా యాత్రలు'** పేరుతో తాము చేసిన యాత్రానుభవాలను పూసగుచ్చినట్టు వివరించడం విశేషం. ఎక్కువ భాగం ఈ యాత్రలకు సహకరించిన ఆకెళ్ళ శేషుకుమార్ శర్మగారు **'మహాగణపతి యాత్రా స్పెషల్'** ద్వారా ఎక్కడా ఇంచుకైనా ఇబ్బంది కలగకుండా యాత్రికులం దరినీ సమాదరించి, వసతులు, భోజనాదికాలు సమకూర్చిన వ్యవహార దక్షత కలిగిన వ్యక్తి కావడం వల్ల మేము మా యాత్రలను సునాయాసంగా చేయగలిగామని చెప్పారు జానకీదేవిగారు.

చిన్నప్పటి నుంచీ యాత్రలు, వివిధ ప్రాంతాలు చూడాలనే ఉత్సుకత ఉండేదనీ, కాలక్రమంలో ఆ కోరిక తీరి అనేక ప్రదేశాలు చూడటానికి తాను పనిచేస్తున్న బ్యాంకువారిచ్చే ట్రావెలింగ్ అలవెన్స్ లవల్ల వెళ్ళగలిగామనీ, శ్రీవారు సంజీవరావుగారి తోడ్పాటు తన అదృష్టమనీ అంటారు.

యాత్రలు మానసిక ఆనందంతో పాటు భక్తిభావం కలుగచేస్తాయనీ, నలుగురితో కలిసి వెళ్ళడం వలన అనుభవాలను పంచుకుంటూ అలసట మరిచిపోతామని ఆమె భావన.


ప్రతి రోజు ఎంతోమంది ఎన్నో యాత్రలు చేస్తుంటారు. కొంతమంది ట్రావెల్స్‌వారి ద్వారా, మరికొంతమంది వ్యక్తిగతంగా, కార్లు, రైళ్ళు లేదా విమానాల ద్వారా ప్రయాణించి తామనుకున్న గమ్యం చేరడం సహజంగా జరుగుతుంటుంది. కానీ ఆ అనుభవాలకు అక్షరరూపం ఇచ్చే వారు అరుదు. తమ అనుభవాలను, యాత్రావిశేషాలను రాసిన రచయితలున్నారు. యాత్రలు చేయాలనుకునే వారికి ఆ అనుభవాలు మార్గదర్శకాలుగా, కరదీపికలుగా ఉపయోగపడుతుంటాయి. షామీర్ జానకీదేవిగారు 2016 నుంచి చేసిన యాత్రలను, విశేషాలను నోట్ చేసి ఇప్పుడు వాటికి ఒక రూపం కల్పించి స్థలపురాణాలతో సహా విపులంగా వివరించారు. కేవలం యాత్రలపట్లనే గాక తమ అనుభవాలను, అనుభూతులను పుస్తకంగా రాయాలనే తలంపు రావడం, దానిని ఆచరణలో పెట్టడం అభినందించదగ్గ విషయం.

2019లో శేషుకుమార్‌గారి నిర్వహణలో జానకీదేవి **'నేపాల్ యాత్ర'** ప్రారంభమైంది. హిమాలయాలు చూడబోతున్నామన్న ఆనందంతో ఉక్కిరిబిక్కిరి అవుతూ విమానాశ్రయం చేరి అక్కడ ఇండిగో ఫ్లైట్‌లో గోరఖ్‌పూర్ చేరి (2 గంటల ప్రయాణం), అక్కడ బస చేసి ఉదయమే గోరఖ్‌పూర్‌లోని బాబా ఆశ్రమం దర్శించుకున్నారు. ప్రయాణంలో కొన్ని ఇబ్బందులు ఎదుర్కొంటూ ఇండియా బార్డర్ సునోలీ వదిలి, నేపాల్ బోర్డర్ బెలహాలోకి అడుగుపెట్టారు.

మర్నాడు 2 గంటలు ప్రయాణం చేసి లుంబినీ (బుద్ధుని జన్మస్థలం) చేరారు. బుద్ధుడు జన్మించిన ఆ స్థలంలో బంగారు ఇటుకలతో నిర్మించిన గోడలు చూసి ఆశ్చర్యచకితులైనారు. అక్కడ అనేక బౌద్ధదేవాలయాలున్నప్పటికీ కంబోడియా దేశస్థులు నిర్మించిన బౌద్ధదేవాలయం అద్భుతం. అనంతరం శ్రీమన్నారాయణుని దర్శనం చేసుకున్నారు.

అక్కడినుంచి పశుపతినాథ ఆలయం దర్శించుకున్నారు. అక్కడ వృషభ రూపంలో ఉన్న రుద్రుడి వెనకభాగం కేదార్‌నాథ్‌లో, శిరస్సు భాగం ఇక్కడ ఉంటాయని స్థానికుల ఉవాచ. భాగమతీనదిని చూసి తిరిగి వస్తున్న దారిలో ఒక పెద్ద గోలీ ఆకారంలో ఒక రాయి ఉంది. దానితో భీముడు గోలీ ఆడుకున్నాడని చెప్తారు. అక్కడ అందరూ దానిని తిప్పుతుండటం చూశారు. 143 అడుగుల ఎత్తైన మహాదేవ ఆలయం చూసి అక్కడి నుంచి కేదారనాథుడి శిరస్సు భాగం పడినచోటుకు వెళ్ళి అక్కడ భోలేశ్వర నాథుడిని దర్శించుకున్నారు. శక్తిపీఠాల్లో ఒకటైన గుహ్యేశ్వరీమాత దర్శనం, తదనంతరం 1300 సంవత్సరాల చరిత్రగల జలనారాయణుడి ఆలయం సందర్శించుకున్నారు.

మర్నాడు గజేంద్రమోక్షం జరిగిన ప్రదేశం వీక్షించి ఇక తిరుగు ప్రయాణం. ప్రయాణం మొదలయ్యే రోజు ఎవరికి వారుగా ఉన్నా ప్రయాణం ముగింపు నాటికి ప్రయాణీకులందరూ ఆత్మీయులుగా మారడంతో ప్రయాణం అప్పుడే ముగిసిందా అనిపించింది. హైదరాబాద్ ఫ్లైట్ ఎక్కడంతో వారి నేపాల్ యాత్ర విజయవంతంగా ముగిసింది. నేపాల్‌యాత్ర జానకి గారికి సదా స్మరణీయమని ఆనందంగా పేర్కొన్నారు.




ప్రతులకు:
షామీర్ జానకిదేవి
సెల్: 85588 99478

22 అక్టోబర్ 2021లో వేములవాడ శివాలయం,తదనంతరం కొండగట్టులోని ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. తెలంగాణలోని సిద్ధిపేట నుంచి 30 కి.మీ. దూరంలో వేములవాడ, అక్కడి నుంచి 35 కి.మీ. దూరంలో కొండగట్టు ఉంటుంది. స్థలపురాణం ప్రకారం ఈ దేవాలయం 300 ఏళ్ళ కిందటిదనీ, దీనిని ఒక గోరక్షకుడు నిర్మించాడనీ కథనం. ఈ ఆలయంలో వేంకటేశ్వరస్వామి, ఆళ్వారు, లక్ష్మీదేవి విగ్రహాలు కూడా నెలకొని ఉన్నాయి.

**షామీర్ జానకీదేవి రచించిన "మేము మా యాత్రలు" పుస్తకానికి వంశీరామరాజుగారు రాసిన ముందు మాట**

14.6.2022లో జానకిగారి కర్ణాటక యాత్ర ప్రారంభమైంది. ఈ యాత్రలో జానకిగారు, ఆమె భర్త సంజీవరావుగారు, కూతురు హరిత, అల్లుడు, మనవడు ఋషితో పాల్గొన్నారు. వారు హైదరా బాదునుంచి ఫ్లైట్‌లో మంగళూరు చేరారు. అక్కడి నుంచి కారులో ఉడిపి, శృంగేరి, కుక్కే సుబ్రహ్మణ్య స్వామి ఆలయాలు సందర్శించారు. ఆ తరువాత మురుడేశ్వర ఆలయం, అక్కడి నుంచి కొల్లూరులోని మూకాంబికా అమ్మ వారి దర్శనం చేసుకుని, హెూర్నాడులో అన్నపూర్ణేశ్వరి దేవాలయం (ఇక్కడ అమ్మవారు ఒక పీఠంపై నిలబడి ఉన్న భంగిమ లో ఉంటుంది), తరువాత ధర్మస్థలి, కుక్కే సుబ్రహ్మణ్య దేవస్థానం దర్శించు కున్నారు. పై దేవాలయాలన్నింటి స్థల పురాణాలు జానకిగారు సవివరంగా పేర్కొన్నారు. దీనితో కర్ణాటక యాత్ర ముగిసింది. మర్నాడు ఫ్లైట్‌లో హైదరాబాద్ చేరుకున్నారు.

10 జులై 2023న బెంగళూరులోని తమ కూతురు, అల్లుడితో కలిసి అరుణాచల యాత్రను వెళ్ళాలని సంకల్పించుకుని వారి కారులో బయల్దేరారు. ఉదయం 8.30కు బయల్దేరిన వాళ్ళు 12.40 ని॥లకు అరుణాచలం చేరారు. అరుణాచలం పంచ భూతలింగాలలో ఒకటి, అక్కడ గిరి ప్రదక్షిణం ప్రధానమైన ఘట్టం. గిరి ప్రదక్షిణ చేయవలసిన ప్రాంతం మొత్తం 14 కి.మీ. ఉంటుంది. అందులో భాగంగా దారిలో మొత్తం 8 (+2) లింగాలు దర్శించుకోవాలి. అనంతరం రమణమహర్షి ఆశ్రమ దర్శనంతో అరుణాచల యాత్ర ముగిసింది. ఆ యాత్రా విశేషాలు సవివరంగా కళ్ళకు కట్టించారు రచయిత్రి.

## కామాఖ్యయాత్ర

23.7.2023లో ఆకెళ్ళ శేషు కుమార్ శర్మగారి ఆధ్వర్యంలోనే కామాఖ్య యాత్ర జరిగింది. ఈ కామాఖ్య ట్రిప్పు కోసం వారు ఏర్పరచిన వాట్సప్ గ్రూపు ద్వారా ఎప్పటికప్పుడు సమాచారం అందుకుంటూ సికింద్రాబాద్ స్టేషన్ చేరుకున్నారు. ట్రైన్‌లో కలకత్తా చేరి అక్కడ మహా కాళి అమ్మవారి దర్శనం చేసుకుని అనంతరం విక్టోరియా మెమోరియల్ బేలూరు రామకృష్ణమఠం సందర్శించారు. రామకృష్ణ పరమహంస విగ్రహం కింద రాసిన కొటేషన్ రచయిత్రిని ఎంతగానో ఆకర్షించింది. 'As many faiths so many paths.' అందరూ విశ్వసించదగ్గ గొప్పవాక్యం కదా! రామకృష్ణ పరమహంసకు ప్రత్యక్షమైన మహాకాళి అమ్మవారిని దర్శించు కున్నారు.

కామాఖ్య అమ్మవారి దర్శనార్థం వెళ్ళిన యాత్రికులు కొన్ని ఇబ్బందులు ఎదుర్కొన్నాక అమ్మవారి అనుగ్రహం కలిగింది. కామాఖ్య తరువాత షిల్లాంగ్ చేరుకున్నారు. చిరపుంజిలో వాటర్‌ఫాల్స్ చూశారు. మహాదేవుడు స్వయంభువుగా వెలసిన ఉమానందస్వామి (ముక్కంటి) దర్శనం చేసుకుని అనంతరం అష్టాదశ శక్తిపీఠాల లో ఒకటైన గిరిజామాత జాజిపూర్ వైపు పయనం. ఇక భువనేశ్వర్ మార్గమధ్యంలో కొన్ని ఆలయాలు చూస్తూ పూరీ జగన్నాథుని దర్శించుకుని భువనేశ్వర్ చేరారు. కోణార్క్ దేవాలయం దాకా వెళ్ళాక సమయం సరిపోలేదు. దైవదర్శనం కాకపోగా, ఫ్లైట్ కూడా అందుకోలేకపోయారు. చివరికి తంటాలు పడి మధ్యేమార్గంగా వేరే ఫ్లైట్‌లో హైదరాబాద్ చేరుకున్నారు.

2023 డిసెంబర్‌లో ఖమ్మం దగ్గర ఉన్న జీళ్ళచెరువులో కొండపై వెలసిన వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు.

## ద్వారకా తిరుమల యాత్ర

కారులో ప్రయాణించి కుటుంబ సభ్యులతో ద్వారకా తిరుమల చేరుకున్నారు. ద్వారకా తిరుమల ఆంధ్రప్రదేశ్‌లో పశ్చిమగోదావరికి చెందిన ఒక గ్రామం. ఇది భారతదేశంలో అత్యంత ప్రాచీన క్షేత్రంగా భావిస్తారు. శేషాద్రి కొండమీద వెలసిన స్వయం భువు శ్రీ వేంకటేశ్వరస్వామి. చిన్న తిరుపతిగా ప్రసిద్ధి చెందిన ద్వారకా తిరుమల స్థలపురాణం కూడా రచయిత్రి వివరించారు. ద్వారకా తిరుమల నుంచి వెూపిదేవి ఆలయం దర్శించుకుని తిరుగుప్రయాణంలో విజయవాడలోని కనక దుర్గ అమ్మవారిని కూడా దర్శించుకుని హైదరాబాద్‌చే రుకోవడంతో ఈ యాత్ర ముగిసింది.

పైన చెప్పిన యాత్రాస్థలాలే కాకుండా గుజరాత్, రాజస్థాన్, ఉజ్జయినీ, కేరళ రాష్ట్రాలను కూడా దర్శించి, తమ అనుభవాలను, స్థల విశేషాలను వివరింగా అందించారు. హైదరాబాద్ నుంచి బెంగళూరు వరకూ వందేభారత్ ట్రైన్‌లో ప్రయాణించి, ఆ ట్రైన్‌ను నేలమీద నడిచేవి మానంగా అభి వర్ణిస్తూ, దానిలోని సౌకర్యాల గురించి చాలా బాగా విశదీకరించారు.

షామీర్ జానకీదేవిగారు వారి యాత్రా విశేషాలను చాలా వివరంగా పొందుపరిచారు. స్థలపురాణాలు కూడా సేకరించి ఆయా పుణ్యక్షేత్రాల మహిమలు తెలియజేశారు.

ఇన్ని అంశాలు, ఇన్ని పుణ్యక్షేత్రాలు వారి కుటుంబ సభ్యులతో దర్శించడమే కాక పాఠకులకు తమ అనుభూతులతో కలిపిన అనేక అంశాలను ఒక రచయిత్రిగా మంచి శైలితో అందజేశారు. చదువుతున్నంతసేపు నేను కూడా జానకిగారితో కలిసి ఆ పుణ్యక్షేత్రాలు దర్శించుకున్న అనుభూతి కలిగింది.

–వంశీ రామరాజు
తెన్నేటి సుధాదేవి



మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 1589వ రోజు 'హాస్యం' అనే అంశంపై పలువురు కవులు తమ కవితలను పంచుకున్నారు. కవితల సాధన చేస్తున్న కవులందరికీ అభినందనలు. 'హాస్యం' అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం.

–సంపాదకులు

**మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం**
అడ్మిన్ & ఏకాంశ కవిత్వ నిర్వహణ:
–డా॥రాయారావు సూర్యప్రకాశ్‌రావు,9441046839



### లాస్యం

హాస్యం లాస్యం
అవశ్యం అవసరం
వెన్నెల కురిపించు
బాధని మరపించు
నవ్వులపూలు
పెదాలపై విరిసి
అల్లిపూలమాలలూగు.
సమయస్ఫూర్తి
చురుకుదనం
చురక మాట చేతల్లో
ఫన్నీగా
హ్యూమర్, జోక్స్, పేరడీలతో
చిత్తం శాంతించు
వత్తిడి తగ్గించు
హాస్యం దేవుని బహుమతని
పాశ్చాత్యుల భావన.
నవరసాల్లో ఒకటి
నటుల గాత్రాల్లో
గిరీశం గణపతి
నేటికీ శాశ్వతం
రాయడం కష్టం
మాట్లాడటం ఇష్టం అనేవారిలో
చిప్పిల్లు హాస్యపు ఊట.
ఆనాటి సినీనటుల
హాస్య నటన
వాచికాభినయాలు
నేడు మృగ్యం
ఇంట బైట బడిలో సభలో
హాస్యంగా పదాలవిరుపుతో
నవ్వుల జల్లులు
ఆఖరిదాకా ప్రేక్షకులు.
బోధన లో హాస్యం రంగరిస్తే
పిల్లల కెంతో మక్కువ
అధ్యాపకులపై
ప్రేమాభిమానాలు శాశ్వతం.
రోగాల తగ్గించే
మానసిక చింత తొలగించే
ఏడ్చే వాడిని నవ్వించే
జన్మ ధన్యం
జరుక్ శాస్త్రి పేరడీలు
తెలుగుసాహిత్యంలో గారడీలు
చదవాలి నవ్వాలి
రోగాలు మాయం
కాయానికి
బలం, ఉత్తేజం.

–ఎ.రాజ్యశ్రీ

### కడుపుబ్బనవ్వు

నవ్వు అనే ఔషధం
దీని లేని జీవితం వర్షంలేని వర్షధార!
నవ్వితే కడుపు ముక్కలవుతుందేమో
కానీ దుఃఖం మాత్రం పారిపోతుంది గమగమా!.
జోకు వినగానే మామయ్య పొట్ట పట్టుకున్నాడు
అత్తయ్య నవ్వుతూ బల్లకింద జారిపోయింది.
పిల్లాడు మాత్రం "ఇంకోటి చెప్పు" అన్నాడు
చూసేవారంతా కన్నీళ్లు తుడుచుకుంటూ నవ్వేశారు!.
పొరుగింటి మామిడి దొంగతనమా
కాదు కాదు .. అది సరదా ఆట!
కెమెరాలో పట్టుబడితేనేం
మనసు మాత్రం పండ్ల మాదిరి తీయదనమా!.
వేడుకల్లో వేషాలు వేసినవాడు గాంధీ అని చెప్పాడు
అందరూ చప్పట్లు కొట్టగా
ఒక చిన్నవాడు "గాంధీకి మీసాలు ఎక్కడ?" అన్నాడు
అక్కడే హాస్యం పువ్వులా పూసింది!.

–వి.సంధ్యారాణి

### సాపాసా సాధన

చిన్నతనంలో కన్న కలలు
తీరిక దొరికిన వేళ
నెరవేర్చుకోవాలని ఆరాటం
అరవైలో ఇరవై వయసు
ఉత్సాహం
వేకువనే లేచిన దగ్గర్నుంచీ
చేస్తోంది సాపాసా సాధన!.
తలచుకుంటే
సాధ్యం కానిదేదీ
నారికి లేదని
తనకు తాను
స్ఫూర్తిని కలిగించుకుంటూ
పాలూ మిరియాలతో
గొంతును శ్రుతి చేసుకుంటూ
చేస్తోంది దినమంతా అభ్యాసం
స్వరాల విన్యాసం
త్వరగా వంటబట్టాలని
సరిగమలు రాని శ్రీలక్ష్మి!.
శంకరాభరణం సినిమాలో
చిన్ని శారదలా
తెల్లవారుజాము వర్షంలో తడిసి
గొంతును వణికించి
గమకాలు పలికించలేక
తడిబట్టలతో వణుకుతూ
అష్టకష్టాలు పడి
అపశ్రుతులను సవరించాలని
దీక్ష బూనింది!.
తంబూరా శ్రుతి
ఎందుకు దండగ
చెంత శ్రీవారుండగా
అనుకుంటూ
వేడుకుంది "కాస్త నా పాటకు
తాళం వేద్దురూ"అంటూ!.
"ఆహా..ఏమి నా
భాగ్యమూ"అంటూ మురిసిన
అపశ్రుతుల బాధిత శ్రీపతి
అదే అదునుగా
వేసాడు తలుపుకు తాళం
పరులెవరూ వచ్చి
పరువు తీయకుండా
పడింది శ్రీలక్ష్మి నోటికి కళ్లెం!!.

–చంద్రకళ దీకొండ

### నవ్వు–నవ్వించు

నవ్వు– నవ్వించు
హాస్యం ఆరోగ్యమూలం
నవరసాలలో నవ్వించే రసం
హాస్యరసం
హాస్య వచన లేఖనాలు
అందరితో కాదు
అది పూర్వజన్మ సుకృతం
జీవితంలో
ఆనంద హేతువు
హృదయాన్ని తేలిక పరిచేది
హాస్యరసం
రాజుల ఆస్థానంలో
విదూషక పాత్ర
కవులందరిలోనూ గొప్పది
శ్రీకృష్ణదేవరాయల స్థానంలో
వికటకవి తెనాలిరామకృష్ణుడు
అక్బర్ ఆస్థానంలో బీర్బల్
నాటక, సినిమా రంగాల్లోనూ
హాస్యానిదే అగ్రస్థానం
హాస్యం
ఎదుటివారి మనసు నొప్పించకుండా
హాయిగా
మనస్ఫూర్తిగా
నవ్వుకునేటట్లు ఉండాలి
కొందరు తమది హాస్యమనుకుంటారు
ఎదుటివారి మనసుకు
నొప్పి కలుగుతుందని
బాధపడతారని అనుకోరు
అది హాస్యం అనిపించుకోదు
హాస్యం హాస్యంగా
నవ్వుల పువ్వులు పండించాలి.

–ఆర్. రమాదేవి

### మాటల చాతుర్యం!

నవ్విస్తూ నవ్వులు పంచుతూ
మనసుకి
ఆహ్లాదాన్ని పంచుతారు కొందరు
మాటల చతురోక్తులతో కవ్విస్తూ
కనికట్టు వేస్తారు మరికొందరు.
హాస్యకళా పారంగతులు
మాటల గారడీతో మైమరిపిస్తూ
రాజుల మహారాజులను మెప్పిస్తూ
నవరస నటనా ప్రతిభను ప్రదర్శిస్తూ
ఎందరో హాస్య బ్రహ్మలు
కరకు గుండెలను కరిగిస్తూ
వికటకవి తన చతురోక్తులతో
బీర్బల్ హాస్యంతో
ఉన్నత వ్యక్తిత్వంతో రాణించారు
హాస్యరసాత్మక నవ్వులను పూయిస్తూ.
లాస్యం హాస్యంతో
మధుర దరహాసాలతో
మురిపాలను ఒలికిస్తారు
కన్నయ్యలా
ముద్దులు మూటకట్టే
కిలకిల నవ్వులు రువ్వుతూ.

–పి.పద్మావతి

### భాషా వేషం

హాస్యం
నవరసాల్లో నవ్వించే రసం
ప్రక్రియ ఏదైనా
హాస్యం కలిస్తేనే పండేది
జీవితంలో వినోదం
హాస్యంతోనే
రాజుల ఆస్థానంలో
విదూషకుడి హాస్యం
అక్బర్ చక్రవర్తిని నవ్వించిన బీర్బల్ హాస్యం
తెనాలి రామలింగకవి పండించిన హాస్యం
ఊరూరా పిట్టల దొర హాస్యం రసాత్మకం
భాషా వేషాలతో హాస్యం హృద్యం
ఆటల్లో మాటల్లో పాటల్లో హాస్యం
నాటక రంగంలో హాస్యానిది ప్రత్యేకం
బుర్రకథ హరికథ
యక్షగానంలో
రామాయణంలో పిడకల వేటలా
వీధి నాటకాలు పాములాట
తీగలపై హాస్యం
దీపావళి హోళీ సమయాల్లో
విచిత్ర వేషాలు
సినిమాలో మూసపద్ధతి హాస్యం
నటుల ఆహార్యంలో
నటనలో పలుకులో హాస్యం
ప్రభూ తాళం వేసితిని
గొళ్ళెం వేయుట మరిచితినంటూ.

–లక్ష్మారెడ్డి పసుల

### హాస్యం ఆరోగ్య ఔషదం

జీవితంలో సంతోష సమయాలంటే
హాస్యాన్ని ఆస్వాదించే క్షణాలే
లక్ష్యం సాధించినపుడో
ఆర్థికంగా కలిసొచ్చినప్పుడో
చిన్ననాటి స్నేహితులు కలిసినప్పుడో
ఆటల్లోనో కళారంగంలోనో
బహుమతి పొందినప్పుడో
సంతోషించడమే కాదు
పదిమందికీ చెప్పుకుంటాం
కానీ మన విచారాన్ని పోగొట్టి
విషాద వాతావరణాన్ని సైతం
దూరం చేసేది మాత్రం హాస్యమే
పూర్వం నుండీ కళల్లో
హాస్యానిది ప్రత్యేక పాత్ర
దానికొరకే ప్రత్యేక పాత్రలు
భాష దుస్తులు అలంకారాలు
పూర్వం బుర్రకథల్లో యక్షగానాల్లో
గొప్పలు చెప్పుకునే
లతుకోరుసాబు పాత్రలో
సర్కస్ లలో సినిమాలలో
ఎప్పటినుండో
ప్రస్తుతం దీనికోసం
ప్రత్యేక ఛానళ్ళు కూడా
హాస్య సంభాషణలు వినడం ద్వారా
దృశ్యాలు వీక్షించడం ద్వారా
మనసు ఉల్లాసభరితం
చుట్టుపక్కల వారితో సరస భాషణాలు.

–నాగిరెడ్డి అరుణ జ్యోతి

### హాస్యో భిన్నరుచిః

ఉల్లాసంగా
నాభి నుంచి మస్తిష్కం
కండరాలను కదిలించేది
ఎదల బెడదలను తొలగించేది
నవ్వుల పువ్వులు వెదజల్లేది
ఆరోగ్య సంతోషాల రహస్యం
మృదు మధుర మిళిత హాస్యం.
వెక్కిరింపులను
ఎగతాళులను చూపేది
వికృత హాస్యం
ఒకరి దుఃఖాన్ని
బలహీనతలను
ఎత్తిచూపేది అపహాస్యం
చవకబారుతనాన్ని ఆశ్రయించే
వెకిలితనం కానే కాదు హాస్యం.
సమాజ ఉద్ధరణల లోటుపాట్లను
తొలగించే సందేశాల హాస్యం
ఎదల లోతుల్లోంచి కదిలించి
శ్రమ, వెతలను మరిపించి
సృజించే సున్నిత హాస్యం
కాలుష్యం,కఠినత్వం
వినాశక ఆలోచనలను
శుద్ధిపరిచే స్వచ్ఛ హాస్యం
చేపట్టి చెంతచేరిన
హాస్య మాధుర్యాల్లో
మనమంతా ఊయలలు.
హాస్యం భిన్న రుచులైనా
భిన్న ఫలితాలది కాదు.
హాస్యమంటే
వయోవృత్యాసం లేక
శుద్ధ పసితనాన్ని చేకూర్చేది
మిత హాస్యం ఎల్లప్పుడూ
హితమైన వ్యంజనమే
ఆరగించు
ఆనందించు
పంచిపెట్టు!.

–రాజప్ప

### నవ్వు–నువ్వు

నవ్వు
నువ్వు పువ్వులా
ఇవ్వునాకు దవ్వులనిల్చి
రువ్వు కిలకిలా
శబ్దాల పరిమళాలు.
నవ్విస్తే నవ్వేది నవ్వు కాదు.
ఆపుకొన్నా ఆగనిదే
అసలైన నవ్వు
నవ్వులో నానా రకాలు
భారతంలో తిక్కన
పూయించాడు అందరిచేత
ముప్పైమూడు రకాల
నవ్వుల పువ్వులు.
బెమ్మనందం బాబాయ్
ముఖం చూస్తే
ముంచుకొస్తుంది నవ్వులవాన
బ్రహ్మ
ఎన్ని కిలోల హాస్యరసం
బాబాయికి
బహుమతిగా ఇచ్చాడోచెప్మా!.
సూరికాంతమ్మ
సినిమా గయ్యాళి గంప
అప్పుడప్పుడు దింపుతుంది
నవ్వుల గంప
ఆమెకోపంతో
మనకు నవ్వుల వెలుగు.
హాస్యరసం లేకుంటే
జీవితమే నీరసం.
అందుకే చెవులుపిండి
కూర్చోబెట్టి
పిల్లలకి పెద్దలకి
పొద్దున్నే తాగించాలి
హాస్యరసం
నవ్వులతో
మీ దవ్వులకు రావు
శోకరసం–నీరసం
జీవితమే రసమయం.

–డా.సి వసుంధర

### నవ్వు

నవ్వు
నవ్వించు
నలుగురిలో
నగుబాటుగాకు.
చిరునవ్వు ప్రేమపూరితం
మందహాసం మమతానురాగం
దరహాసం గొప్పతనం
అపహాస్యం అవమానం.
నవ్వు నాలుగువిధాలు
వెకిలింత నవ్వు
అహంభావ నవ్వు
అమాయకపు నవ్వు
మోసపూరిత నవ్వు.
కడుపులో విషంతో నవ్వు
ఓర్వలేనితనంతో నవ్వు
కవ్వించే నవ్వు
ప్రేరేపించే నవ్వు.
నవ్వు ఆరోగ్యం
సంతోషానికి సంకేతం
శరీరానికి వ్యాయామం
కుటుంబానికి ఆనందం.
నవ్వు జీవనం
నవ్వుతూ బతకాలి.

–గుండవరం కొండల్ రావు

### గార్దభం–ధర్మనిష్ట...!

బండెడు బట్టల మోత
రజకులగుండెల
బరువుకు
కొండంత ఊత
శ్రమశక్తి
సౌందర్యానికి ప్రతీక
గాడిద లక్షణం!
వలస వృత్తిదారుల
బరువైన మోతలకు నేత!
చంటిపిల్లలకు మరు తల్లిగా
ఉబ్బసానికి
తన పాలను అమ్మి జీవించే వారికి
తనకే తెలియని చేయూత!
అద్భుతశక్తిదాయినీ!
సేవాగుణం దానిపరమార్థం!
తన పేరుతో
మనుషులు ఒకరినొకరు
దూషించుకున్న
ఏమెరుగని నిష్కపటజీవి!
ఇప్పుడున్న కాలంలో
వాటిసంఖ్య అత్యల్పమే!
ఉన్న యింటిని
కన్నతల్లిగా భావిస్తుంది!
బాధపెట్టాలనో
పెద్దరికం చూయించాలనో
గదమాయిస్తేనో
వెనుకనున్న కాళ్ళతో
మూతి పళ్ళురాల గొడుతుంది
ఆడితప్పిన వారికి
పాడితప్పిన వారికి
దానికున్న జ్ఞానం
కనువిప్పు కలుగిస్తుందని
మనసు పొరల్లో
చిన్న ఆశ!!

–డా॥గన్నోజు శ్రీనివాసాచార్య
8555899493



# పద్య గేయాలతో ఆలోచింప చేసిన మేఘ విచ్ఛేదనం

–సూరారం శంకర్




కామారెడ్డి తెరవే ఆధ్వర్యంలో మేఘవిచ్ఛేదనం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సూరారం శంకర్ తదితరులు

హైదరాబాద్, అక్టోబర్ 22: (నేటినిజం ప్రతినిధి):తెరవే జిల్లా ఉపాధ్యక్షులు కవి రచయిత ఎనిశెట్టి గంగా ప్రసాద్ రచించిన మేఘవిచ్ఛేదనం పుస్తకంలో కామారెడ్డి లోని జలవిలయ వేదనను వర్ణించారని ఎన్నో సూచనలు ఉన్నాయని పుస్తక ఆవిష్కర్త సూరారం శంకర్ అన్నారు. కామారెడ్డిలో ఆదివారం తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం భవనంలో ఎనిశెట్టి గంగా ప్రసాద్ రాసిన మేఘ విచ్ఛేదనం పుస్తకాన్ని గజల్ కవి సూరారం శంకర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మేఘవిచ్ఛేదనం పుస్తకంలో ఆలోచనత్మకమైన అంశాలు ఉన్నాయని అన్నారు. సభకు అధ్యక్షత వహించిన తెరవే కామా రెడ్డి జిల్లా అధ్యక్షులు గఫూర్ శిక్షక్ మాట్లాడుతూ సాహిత్యం సమాజాన్ని ఆలోచింపజేయాలని మార్గదర్శకంగా నిలవాలని సమాజానికి ఆపద వచ్చినప్పుడు తోడుగా నిలవాలని అన్నారు. పుస్తక కర్త ఎనిశెట్టి గంగా ప్రసాద్ మాట్లాడుతూ భవిష్యత్తులో మరెన్నో మంచి రచనలు చేస్తానని అన్నారు .ఈ పుస్తక ఆవిష్కరణ కార్యక్రమంలో పుస్తక కర్త ఎనిశెట్టి గంగా ప్రసాద్ ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో తెరవే ప్రతినిధులుమోహన్ రాజ్ ,మంద పీతాంబర్, శ్యామ్ కుమార్ మౌర్య , కాశ నరసయ్య , తిరుపతిరావు, సంఘు గౌడ్, రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వెంకటి కందుకూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# కుసుమ ధర్మన్న కవన భేరి

పుస్తక సమీక్ష

తెలుగు నేలపై కలాన్ని ఆయుధంగా మలచి సాంఘిక అసమానత, కుల దురాచారాలపై ధ్వజం ఎత్తిన దళిత కవి కుసుమ ధర్మన్న జయంతి సందర్భంగా 'ధర్మన్న కళాపీఠం' అధ్యక్షులు డా॥ రాధాకుసుమ, 2025 కవితా సంకలనంగా కుసుమ ధర్మన్న కవన భేరి ప్రచురింపచేసారు. ఈ సంపుటి లో 53 కవితలు చోటు చేసుకున్నాయి. **'మా కొద్దీ నల్లదొర తనం'** అంటూ, దళిత జాతి ధ్రువతార, వైతాళిక ఉద్యమజాతి నేతగా, డా॥అంబేద్కర్ ఆశయ దీప్తితో జీవితాంతం పోరాడిన ధర్మన్న, అడుగు జాడలను సంపుటిలోని కవులు అందరూ చిరఃస్మరణీయంగా కవితలుగా ప్రతిధ్వనింపచేసారు. రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన కవులతో ఈ సంకలనం, దళిత ఆత్మ గౌరవ చైతన్యానికి ప్రతీకగా, ధర్మన్న గుండె చప్పుడుకు అక్షర నీరాజనం సమర్పిస్తోంది. ఈ కవన భేరి సంకలనానికి డా॥రాధా కుసుమ, డా॥ ర్యాలి శ్రీనివాసు సంపాదకులుగా వ్యవహరించారు. అంబేద్కరిజమే ఈ దేశానికి అసలు సిసలైనధర్మం అని వెలుగెత్తి చాటిన మానవతామహోన్నతుడు, దళిత చైతన్య శంఖం పూరించిన , నీలి రాజ్య ఆశయ ఆవిర్భావానికి స్వాప్నిక ధార్శనికులైన కుసుమ ధర్మన్నను ఈ సంపుటిలో కవులు ప్రస్తుతించిన తీరు తెన్నులు, వెలుగు దీపికలుగా ప్రసరింపచేస్తున్నాయి. ఆదికావ్యం పుట్టిన నేలకు ఆది ఆంధ్రుల కన్నీటిని అక్షర మాలలు చేసిన హరిజన శతకానివి అంటారు **'వెలుతురు పువ్వు'**లో కె. నాగ సత్యనారాయణ.

ప్రతులకు:
డా॥రాధా కుసుమ
అధ్యక్షులు
కుసుమ ధర్మన్న కళాపీఠం
హైదరాబాద్
సెల్: 9989241319

సంఘ సంరక్షణకు కలంపట్టి గళం విప్పి కదం తొక్కిన, జయభేరి పత్రికా సుజనకీర్తి అంటారు **'దళిత భవిత'**లో పోలూరి విజయశ్రీ. రేపటి చీకటికి నీ పాటే దివిటీ అంటారు **'చైతన్య భాస్కరుడు'**లో డా॥ మురహరరావు ఉమాగాంధీ, దళిత సంస్కరణం ధర్మన్న పతాకం అంటారు గాంగేయుల రవికుమార్. వేదగోదావరి అలల పడగల్ని తొక్కి, జయభేరి మోగించిన మాలో వాడ.. అంటూ **'ఒక్కడు చాలు'** అంటారు నేలపూరి రత్నాజీ. అతని కలం గుండెలో రగిలే జ్వాలకు అక్షర రూపం అంటారు సావిత్రి ప్రసాద్ గునుపూడి. కుల వ్యవస్థలేని సమసమాజం కోసం ధర్మన్న ధిక్కార స్వరం వినిపిస్తారు. డా॥శ్రీపాద సీతామహాలక్ష్మి, హైదరాబాద్‌లో దళిత ఉద్యమకారుల సాన్నిహిత్యం ప్రస్తావిస్తారు పేరి అన్నపూర్ణ. జాతిపితను తన వాడకే రప్పించుకొన్న కారణజన్ముడు అంటారు డా॥ బలిజే పల్లి నాగరత్నం.

స్వచ్ఛమైన తీరాలకు తాను నిచ్చెనై నిలబడతానన్నాడు అంటారు గోదావరి కవి డా॥ ర్యాలి శ్రీనివాసు, మొనదేలిన పలుకులలో, కుసుమ ధర్మన్న కళాపీటం యొక్క ప్రధాన లక్ష్యం, వివరిస్తూ డా॥రాధా కుసుమ, వారి అడుగు జాడలను గుర్తు చేసుకొంటూ, ఆధునిక సాహిత్య ప్రక్రియల కవులను ఆహ్వానించే విధంగా సాహితీ సేవను కొనసాగించటం, తెలుగు నేల నలుమూలలా కవుల కలాలను కదిలించగలగటం అభినందనీయం.

–జయసూర్య
సెల్:9440664610



